



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

> మొంథా తుఫాను తీరాన్ని తాకింది. ఈ అర్ధరాత్రికి తీరం దాటుతుందని అంచనా వేస్తున్నాం. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోనూ తుఫాను ప్రభావం కనిపించింది. రేపు ఉదయం 70 నుంచి 90 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ చెబుతోంది. తుఫాను తీవ్రత పూర్తిగా నెమ్మదించేవరకూ అంతా అప్రమత్తంగా ఉండాలి. రిజర్వాయర్లు, చెరువులు, కాల్వలు గండ్లు పడకుండా జాగ్రత్తపడాలి. భీకర గాలులకు అనేకచోట్ల చెట్లు నేలకూలాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలిగిస్తున్నాం. గ్రామాల్లో ప్రభుత్వ ప్రతినిధులు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందే బాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలి. క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియచేయండి. విద్యుత్ సరఫరా నిలిచిన చోట తక్షణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి. ఎక్కడా ఎటువంటి ఘటనలు తలెత్తకుండా సచివాలయ సిబ్బంది ఉత్తమంగా విధులు నిర్వర్తించినందుకు అభినందనలు. తీరం దాటిన తర్వాత కూడా మొంథా ప్రభావం ఉండొచ్చు. అప్రమత్తత అవసరం. ఐదు రోజులుగా తుఫానును ఎదుర్కొనేందుకు సమర్ధవంతంగా యంత్రాంగం పనిచేసింది. ఎక్కడైనా ఆస్తి, ప్రాణ, పంట నష్టాలు సంభవిస్తే వాటిని గుర్తించి... పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
>
> **-సీఎం చంద్రబాబు నాయుడు**

అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకిన మొంథా తుపాను.. నరసాపురం వద్ద మంగళవారం అర్ధరాత్రి తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో తుపాను కదలడంతో.. తీరప్రాంతం అల్లకల్లోలంగా కనిపించింది. తీరందాటే సమయంలో గంటకు 90-100 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచినట్టు వాతావరణ శాఖ ప్రకటించింది.



## తీరందాటిన మొంథా

# తప్పిన ముప్పు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను మంగళవారం అర్ధరాత్రి తీరం దాటింది. కాకినాడ-కళింగపట్నం మధ్య నరసాపురం వద్ద తీరం దాటినట్టు ఐఎండీ ప్రకటించింది. మంగళవారం రాత్రి 11.30నుంచి 12.30 మధ్యలో తీరం దాటినట్టు వాతావరణశాఖ స్పష్టం చేసింది. దీంతో భూభాగంపై 'మొంథా' తుపాను బలహీనపడనుంది. తీరందాటే సమయంలో గంటకు 90నుంచి 100 కి.మీ వేగంతో తీరప్రాంత జిల్లాల్లో భారీ గాలులు వీచాయి. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ప్రకటించారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో మోస్తరునుంచి భారీవర్షాలు కురిసే అవకాశముందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.







## అల్లకల్లోలం ఉప్పాడ తీరం..

'మొంథా' తీరంచేరిన క్రమంలో కాకినాడ సమీపంలోని ఉప్పాడ తీరం అల్లకల్లోకలంగా మారింది. భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. మచిలీపట్నంలో గంటకు 82 కి.మీ. బాపట్లలో గంటకు 54 కి.మీ, విశాఖలో గంటకు 33 కి.మీ, కాకినాడలో గంటకు 33 కి.మీ, రాజమండ్రిలో గంటకు 37 కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయి. ఉప్పాడ తీరంలో గాలుల తీవ్రత పెరిగింది. తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. పల్లిపేట వద్ద రహదారి కోతకు గురైంది. సుబ్బంపేటనుంచి నేమం వరకూ బీచ్ రోడ్డును దాటుకొని అలలు ఎగసిపడుతున్నాయి. తుపాను తీరందాటే ప్రక్రియను మచిలీపట్నం డాప్లర్ రాడార్ స్పష్టంగా పరిశీలిస్తోంది. 'మొంథా' తుపాను నేపథ్యంలో ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరుజిల్లా కావలి, ఉలవపాడులో 17సెం.మీ, దగదర్తిలో 15.5 సెం.మీ, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 12 సెం.మీ, విశాఖలో 10.8 సెం.మీ. ఒంగోలులో 10.4 సెం.మీ, నెల్లూరులో 10 సెం.మీ, నర్సాపురంలో 10 సెం.మీ, కాకినాడలో 6.4 సెం.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు తుపాను నేపథ్యంలో భారీ ఈదురుగాలులు వీస్తున్నాయి.

# అయినా.. అప్రమత్తం!



'మొంథా' తుపాను తీరం తాకిన నేపథ్యంలో.. ప్రజలు, అధికార్లు, యంత్రాంగం మొత్తం ఇప్పుడే అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. తుపాను అనంతర పరిణామాల్లో అదే జాగ్రత్తలు తీసుకుని నష్టాలు సంభవించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. మొంథా ప్రభావంపై సీఎం చంద్రబాబు అధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రెండుసార్లు ఆర్టీజీ సెంటర్‌నుంచి, రెండుసార్లు టెలీకాన్ఫరెన్సులతో సమీక్షలు నిర్వహించారు. చివరిగా ఆర్టీజీ సెంటర్‌నుంచి అర్ధరాత్రి సమీక్షించి.. రియల్ టైంలో తగు సూచనలు జారీ చేశారు. చెట్ల తొలగింపు, సబ్ స్టేషన్లలో సమస్యలు తక్షణం పరిష్కారమయ్యేలా కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. సీసీ కెమెరాల ద్వారా క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబుతోపాటు ఆర్టీజీఎస్ కేంద్రంలో మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, నారాయణ ఉన్నారు. ఆర్టీజీ సెంటర్‌నుంచి వర్షప్రభావిత జిల్లాల్లో మంత్రులు, అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ.. ఏపీకి పెనుముప్పు వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక ఏపీలోని తుపాను పరిస్థితిపై సీఎంకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఫోన్ చేసి మాట్లాడారు. పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మొంథా తుపానుపై చిట్టచివరి సమీక్ష ముగించి అర్ధరాత్రి తరువాత ఆర్టీజీఎస్‌నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకున్న సీఎం చంద్రబాబు. 12 గంటలపాటు ఏకధాటిగా టెలికాన్ఫరెన్సులు, సమీక్షలు, వీడియో కాన్ఫరెన్సులతో తుపాను ప్రభావాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. సీఎం వెళ్లిన తరువాతా సచివాలయంలోనే ఉండి తుపాను పరిస్థితులను మంత్రి నారా లోకేష్ సమీక్షిస్తున్నారు. రాత్రంతా సచివాలయంలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని మంత్రి లోకేష్ నిర్ణయించుకున్నారు.

## వార్ రూమ్స్ పెట్టండి

'మొండా' తీవ్ర తుపాను నేపథ్యంలో సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఒడిశా, తెలుగు రాష్ట్రాల్లో డివిజనల్ వార్ రూములు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలను రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలో అవసరమైన సామగ్రి, యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను దృష్ట్యా తీసుకుంటున్న చర్యలపై నివేదిక కోరారు.





## రౌండ్ ద క్లాక్!

రాత్రి 12.30 గంటల సమయంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉండటంతో.. తుపాను ప్రభావం తొలగే వరకూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి నారా లోకేష్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఆర్టీజీఎస్ కేంద్రంలోనే రాత్రికి బస చేస్తున్నట్టు మంత్రి లోకేష్ ప్రకటించారు.



## భారీ వర్షాలు.. కూలిన వృక్షాలు

మొంథా తుపాను కథనాలు లోపలి పేజీలలో

**అత్యవసర సహాయ నంబర్లు**

**112**

**1070**

**1800 425 0101**



# అనుక్షణం అప్రమత్తం

అమరావతి (చైతన్య రథం): మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్ష ప్రభావంతో ఆకస్మికంగా వాగులు పొంగి ప్రవహించే అవకాశమున్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీఎస్ నుంచి మొంథా తుపాను ప్రభావంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి సమీక్షించారు. గతంలో వచ్చిన తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం మొంథా తుఫాను కోస్తాంధ్ర తీరానికి అత్యంత సమీపంగా వస్తోందని.. ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా చేరుకుని తీరాన్ని దాటే అవకాశముందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తదితర తీరప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత ఎక్కువగా ఉందని సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం తుఫాను తీరందాటే అవకాశమున్న కాకినాడ పరిసర ప్రాంతాలకు మరిన్ని రెస్క్యూ బృందాలను, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశించారు. గాలులు, వర్ష తీవ్రతను అంచనావేస్తూ అందుకుతగినట్టుగా యంత్రసామాగ్రిని, సమాచార పరికరాలను అత్యవసర యంత్రాలను, బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండు రోజులనుంచి రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షానికి ఎంత ప్రాంతం నీట మునిగింది...? ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో అంచనా వేసి లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గ్రామ, వార్డు సచివాలయాలనుంచి క్షేత్రస్థాయి సమాచారం తెప్పించుకుని విశ్లేషించుకోవాలన్నారు. గతంలో హుద్‌హుద్ తుఫాను సృష్టించిన విధ్వంసంనుంచి ప్రజలను నాలుగు రోజుల్లో తిరిగి బయటకు తెచ్చామని సీఎం గుర్తు చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదైనందున ఆ ప్రాంతంలోని ఎర్రకాలువకు ఎగువనుంచి ఆకస్మాత్తుగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయటంతోపాటు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

- తుఫాను ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించండి
- వాగులుపొంగే అవకాశమున్నచోట అప్రమత్తం
- డ్రోన్లద్వారా ముంపు ప్రాంతాలపై దృష్టిపెట్టండి
- గాలుల విధ్వంసాన్ని గుర్తించి పునరుద్ధరణ చర్యలు
- మొంథా'పై యంత్రాంగాన్ని అలెర్ట్ చేసిన సీఎం చంద్రబాబు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి సమీక్ష

## ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ పునరుద్ధరణ చర్యలు

గడచిన 24 గంటల్లో విశాఖ, కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. మొంథా తుపాను ప్రభావం కారణంగా వర్ష ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి భారీ వర్ష సూచనలకు సంబంధించిన సమాచారాన్ని మొబైల్ ఫోన్లకు పంపామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా 2,703 జనరేటర్లను కూడా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎంకు తెలిపారు. సచివాలయాల వారీగా నిత్యావసర వస్తువులను కూడా సిద్ధం చేసుకున్నట్టు వివరించారు. అత్యవసర సమయంలో కమ్యూనికేషన్ కోసం పోలీసు విభాగం 81 టవర్లతో వైర్ లెస్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. జేసీబీలు, యంత్ర పరికరాలను కూడా యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పశువులకు కావాల్సిన గ్రాసం కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, చెట్లు, టవర్లు, హోర్డింగ్ లు పడిపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్ష ప్రభావంతో ఇప్పటి వరకూ 43 వేల హెక్టార్ల పంట నీట మునిగిందని అధికారులు తెలిపారు. కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నీటమునిగిందని సీఎంకు వివరించారు. అయితే పంట నష్టం వివరాలను రైతులు కూడా పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో మార్పు చేర్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తుఫాను కారణంగా రోడ్లపై చెట్లు, విద్యుత్ స్తంభాలు, రోడ్ల ధ్వంసం వంటివి జరిగితే ఊళ్ల మధ్య రాకపోకలకు ఇబ్బంది అవుతుందని... అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి యంత్రాంగంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని, అందరూ ఫీల్డులో ఉన్నారని మంత్రి నారా లోకేష్ సీఎంకు వివరించారు. ప్రస్తుతం రాయలసీమలో వర్షాలు లేనందున ఎగువ నుంచి వచ్చే కృష్ణా ప్రవాహాలను అక్కడి చెరువులు నింపే ప్రక్రియను చేపట్టాలని సీఎం జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఒక్క టీఎంసీ నీటిని కూడా కోల్పోకుండా నీటిని నింపే చర్యలు తీసుకోవా లని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, సీఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నెల్లూరులో అత్యధిక వర్షపాతం

ఇప్పటివరకు నెల్లూరు జిల్లాలో అత్యధికంగా వర్షపాతం నమోదైందని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చా౦. గత నాలుగు గంటల్లో విశాఖ, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లోనూ అధిక వర్షపాతం నమోదైందన్నారు. రాత్రి 9గంటల ప్రాంతంలో కాకినాడకు 150 కిలోమీటర్ల దూరంలో సైక్లోన్ కేంద్రీకృతమైందని, అర్ధరాత్రి 11.30కు తుఫాన్ తీరం దాటవచ్చని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. రాత్రి తొమ్మిది గంటలనుంచి రేపు తెల్లవారుజాము వరకూ భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రాత్రి 9 గంటలనుంచి రహదారులపై రాకపోకల నిలిపివేసినట్టు సీఎం దృష్టికి తీసుకొచ్చారు.రాకపోకల నిలిపివేతతో ఆగిపోయిన వాహనదారులకు ఆహారం, తాగునీటి సరఫరా చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గ్రామ,వార్డు సచివాలయాలవద్ద 3 వేల జనరేటర్లు ఏర్పాటు చేయాలని, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామ, వార్డు సచివాలయాలు బేస్ క్యాంప్‌గా పని చేయాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా వాహనాలు, జేసీబీలు, క్రేన్లు, ట్రాక్టులు సర్లు సిద్ధం చేయాలని, ప్రతి వాహనాన్నీ, జేసీబీలను ఆర్టీజీఎస్‌నుంచి లైవ్ ట్రాకింగ్ చేస్తున్నట్టు అధికార్లు వెల్లడించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని గర్భిణుల క్షేమ సమాచారంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ప్రభావిత ప్రాంతాలకు బృందాలను పంపండి: సీఎం

అమరావతి (చైతన్య రథం): ఆర్టీజీఎస్‌లో మంగళవారం అర్ధరాత్రి మొంథా తుపాను ప్రభావంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు కడపటి సమీక్ష నిర్వహించారు. తుపాను తీరంతాకిన నేపథ్యంలో.. ప్రభావిత ప్రాంతాలకు ప్రభుత్వం నుంచి ఐదారుగురితో ఓ బృందాన్ని పంపాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ బృందాలు గ్రామాల్లో ఉంటే... ప్రజలకు నమ్మకం కలుగుతుందని చెప్పిన సీఎం, కాల్వలు, చెరువులు రోడ్లకు ఎక్కడైనా కోతలు, గండ్లు పడ్డాయా? అనే అంశంపై రాత్రిపూట కూడా పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేయడంతోపాటు.. టెక్నాలజీ సాయంతో పంటనష్టాలను నిక్కచ్చిగా అంచనా వేయాలని సూచించారు. శాఖలవారీగా నష్టం అంచనా నివేదికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించిన ముఖ్యమంత్రి.. నష్టానికి సంబంధించిన ప్రాథమిక అంచనాను కేంద్ర ప్రభుత్వానికి వీలైనంత త్వరగా పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాను ప్రభావం తగ్గగానే యుద్ధప్రాతిపదికన విద్యుత్తును పునరుద్ధరించాలని సమీక్షలో పాల్గొన్న మంత్రి లోకేష్ అధికార యంత్రాగానికి సచించారు. ఆర్టీజీ సెంటర్‌నుంచి మరోసారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం చంద్రబాబు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడారు. ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల కలెక్టర్లతో టెలిఫోన్‌లో మాట్లాడి తుఫాను తీవ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏలేశ్వరం, బుడమేరు తదితర వాగుల్లో ప్రవాహాలపై ఆరా తీశారు. ఏలేశ్వరం రిజర్వాయరుకు రెండురోజుల్లో 3 టీఎంసీ వరకూ ప్రవాహాలు రావొచ్చని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు. వరద నిర్వహణకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సీఎం సూచన చేశారు. జిల్లాల్లోని



పరిస్థితిని సీఎంకు ఫోన్ ద్వారా మంత్రులు నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు తదితరులు వివరించారు. మొంథా తుఫాన్ కారణంగా వేటకు వెళ్లకుండా ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ సాయం ప్రకటించింది. ఒక్కో మత్స్యకార కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం ఇవ్వాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. గత ఐదు రోజులుగా సముద్రంలో వేటకు వెళ్లక జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు.



నెల్లూరు జిల్లా ఇందిరమ్మ కాలనీలో కూలిన చెట్టును తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

చైతన్యరథం

# ప్రజాకాంక్ష మేరకే పునర్వ్యవస్థీకరణ



- పరిపాలనా సౌలభ్యానికి మరింత అవకాశం
- మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ప్రజలఆకాంక్షలు నెరవేరి, పరిపాలనా సౌలభ్యం కలగాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ఈ ఏడాది జూలై 22న ఏడుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై సచివాలంయలో నిర్వహించిన సమీక్షకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు... ఉప సంఘంలోని మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్థన్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక నివేదిక సిద్ధం చేశామని మంత్రులు ఈసందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటును సరిదిద్దేలా జిల్లాల పునర్వ్యవస్థీకరణపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైనా, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపైనా సీఎం చర్చించారు.

### గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోనే సమస్య

కొత్త జిల్లాల ఏర్పాటుపై గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ప్రాంతీయ విభేదాలకు కారణమైందని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు భవిష్యత్‌లో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరగాలని నిర్దేశించారు. రెవెన్యూ డివిజన్ల పునర్వవ్యస్థీకరణను ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. పోలవరం పూర్తయిన తర్వాత ముంపు మండలాల ప్రజలు ఏ రెవెన్యూ వార్డు, ఏ నియోజకవర్గంలో ఉంటారనేదానిపైనా అధ్యయనం చేసి... దానికి అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ జరపాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆ ప్రాంత చిరకాల వాంఛ అని సీఎం ప్రస్తావించారు. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను, ఆయా వర్గాల అభిప్రాయాలను మంత్రులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణపై మంగళవారం జరిగిన తొలి సమావేశంలో పలు అంశాలు చర్చించిన సీఎం... ప్రతిపాదనలపై తదుపరి చర్చలకు వారంలో మరోసారి సమావేశమవుదామని సూచించారు.

## రౌండ్ ద క్లాక్..!

- ఆర్టీజీఎస్‌లోనే రాత్రికి బస చేసిన మంత్రి లోకేష్
- క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి
- తుపాను తీరందాటే వరకూ సమీక్షలు కొనసాగించిన వైనం

అమరావతి (చైతన్య రథం): మొంథా తుఫాను తీవ్రతపై ఆర్టీజీఎస్ కేంద్రంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి నారా లోకేష్.. అర్థరాత్రి 12 గంటలకు ఆర్టీజీఎస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న హెూంమంత్రి అనిత, పురపాలక మంత్రి నారాయణ, ఇతర ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ వచ్చారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఆర్టీజీఎస్ కేంద్రంలోనే రాత్రికి బస చేస్తున్నట్టు మంత్రి లోకేష్ ప్రకటించారు. రాత్రి 12.30 సమయంలో తుఫాన్ తీరందాటే వరకూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. తుఫాన్ తీరందాటే సమయంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను సంప్రదించి తుఫాను తీవ్రత, సహాయక చర్యలపై మంత్రి వాకబు చేశారు. పునరావాస కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించిన లోకేష్.. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో చెట్ల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయో లేదో ఆరా తీశారు.

# ఈ 12 గంటలే కీలకం..

- ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి
- రాత్రి 10నుంచి 12 మధ్య తీరందాటే అవకాశం
- ఎంపీ భరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో కలిసి వివరాలు వెల్లడించిన అజయ్ జైన్



విశాఖపట్టణం (చైతన్య రథం): మొంథా తుపాను మంగళవారం సాయంత్రం 5.00 గంటల సమయానికి కాకినాడ తీరానికి 120 కి.మీ. దూరంలో ఉందని, రాత్రి 10నుంచి 12 గంటల మధ్యలో రాజోలువద్ద తీరందాటే అవకాశం ఉందని కోస్తాంధ్ర 9 జిల్లాల తుపాను ప్రత్యేకాధికారి, రాష్ట్ర స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ పేర్కొన్నారు. ఈ 12 గంటలు చాలా కీలకమని, అంతా మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలు చాలావరకు ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. విశాఖపట్టణం ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లతో కలిసి కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మొంథా తుపాను తాజా వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు ఉన్న తొమ్మిది జిల్లాల్లో మొంథా ప్రభావం ఉంటుందని, ప్రధానంగా కాకినాడ, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. 9 జిల్లాల్లో 554 క్యాంపులు ఏర్పాటు చేశామని, 31,600 మందిని తరలించామన్నారు. కోనసీమ జిల్లావాసులు బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. కొబ్బరి, పామ్ ట్రీలు విరిగిపడే ప్రమాదముందని, కోనసీమలో పవర్ సరఫరాకు విఘాతం కలిగే అవకాశం ఉందని అజయ్ జైన్ పేర్కొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా 18 వేల విద్యుత్ స్తంభాలను సిద్ధంగా ఉంచామన్నారు. కోనసీమ జిల్లా మామిడికుదురులో చెట్టుపడి 48 ఏళ్ల మహిళ దురదృష్టవశాత్తు మృత్యువాత పడిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన వినా ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్పష్టం చేశారు. మరీ అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్లనుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

### అందుబాటులో సహాయక బృందాలు: జిల్లా కలెక్టర్

27వ తేదీ ఉదయంనుంచి 28వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు విశాఖపట్టణం జిల్లాలో 147 మి.మీ. వర్షపాతం నమోదైందని,28వ తేదీ ఉదయం 8.30నుంచి సాయంత్రం 3.00 గంటల వరకు 1.3 సెం.మీ. వర్షపాతం నమోదైందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. సోమవారంతో పోలిస్తే మంగళవారం జిల్లాలో వర్షపాతం తగ్గిందని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, జీవీఎంసీ పరిధిలోని 10 జోన్లలో జోన్‌కు రెండేసి చొప్పున క్యూఆర్టీ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలను, డ్రెయిన్లలో పూడికను తొలగిస్తున్నామని వివరించారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. ప్రస్తుతం 8 క్యాంపుల్లో 144మంది పునరావాసం పొందారని వివరించారు. ములగాడ, సీతకొండ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయని, ఇతర చోట్ల రాళ్లు జారాయని పేర్కొన్నారు. మేఘాద్రి గెడ్డలో 6,000 క్యూసెక్కులు ఇన్ ఫ్లో, 7,000 క్యూసెక్కులు ఔట్ ఫ్లో ఉందన్నారు. జిల్లాలోని 14 చెరువులు ప్రమాదరకర స్థితిలో ఉన్నాయని, ప్రజలను అప్రమత్తం చేయటంతోపాటు పునరావాస కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు.

119 చెట్లు కూలిపోగా 60 తొలగించామన్నారు. 9 విద్యుత్ స్తంభాలు పడిపోగా ఏడింటిని పునరుద్ధరించామన్నారు. 16 యూజీడీ డ్రెయిన్లు పొంగిపొర్లగా మంగళవారం సాయంత్రం నాటికి తొమ్మిదింటిని సరి చేశామని, పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. 29చోట్ల నీరు నిలిచిపోగా 22చోట్ల పునరుద్ధరణ చర్యలు చేపట్టామన్నారు. 8 గోడలు కూలిపోగా 4 చోట్ల చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా 35 ట్యాంకులను అందుబాటులో ఉంచామని కలెక్టర్ వివరించారు. 2 ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని, వాటిలో 90మంది సిబ్బంది ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు ఏమైనా అత్యవసరమైతే హెల్ప్ లైన్ 0891-2590100, 96669 09192, 180042 500009 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. తుపాను తీవ్రత దృష్ట్యా బుధవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించామని కలెక్టర్ పేర్కొన్నారు.

### సరదాలకు ఇది సమయం కాదు..: ఎంపీ

కొంతమంది బీచ్‌లో సెల్ఫీలు తీసుకోవటం కనిపించిందని, దయచేసి అలా ఎవరూ చేయొద్దని, సరదాలకు ఇది సమయం కాదని ఎంపీ శ్రీభరత్ హితవు పలికారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. అధికార యంత్రాంగం బాగా పని చేసిందని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించానని, అధికారులు, సిబ్బంది పక్కా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఫర్వాలేదు కానీ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేఅవకాశం ఉంటుందని, కావున ప్రజలు సమాచారం కోసం ఫోన్లను ఛార్జింగ్ పెట్టుకోవాలని సూచించారు. 11ఏళ్ల క్రితం హుద్‌హుద్ చేసిన నష్టం గురించి మనం దరికీ తెలుసు.. ఇప్పుడు అలాంటి నష్టం వాటిల్లకూడదని దేవుణ్ని ప్రార్థిస్తున్నాను. కాకినాడ,కోనసీమ ప్రజలకు ఏమీకాకూడదని,ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకూడదని భగవంతున్ని వేడుకుంటున్నానని ఎంపీ భరత్ పేర్కొన్నారు. రాష్ట్రంలో, జిల్లాల్లో అనుభవం కలిగిన నేతలు, అధికారులున్నారని, అనుకోని రీతిలో ఏమైనా జరిగినా తక్షణమే పునరుద్ధరించే శక్తి వారికుందని ధీమా వ్యక్తం చేశారు.



కృష్ణా జిల్లాలోని మంగినపూడి బీచ్‌లో...



విశాఖ తీరంలో అలల ఉధృతి...



గండేపల్లి మండలం జడ్ రాగంపేట గ్రామంలో ఈదురు గాలులకు నేలకూలిన వేపచెట్టు



నెల్లూరు జిల్లాలోని కందుకూరు దగ్గర ఉధృతంగా ప్రవహిస్తోన్న ఎర్రవాగు



కేశవరప్పాడు - తిమిడితపాడు గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారి...

# 36వ బుక్ ఎగ్జిబిషన్‌కు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

అమరావతి (చైతన్య రథం): దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే విజయవాడ బుక్ ఎగ్జిబిషన్‌కు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆహ్వానించింది. 2026 జనవరి 2న విజయవాడలో నిర్వహించనున్న 36వ బుక్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా సొసైటీ అధ్యక్షుడు టి మనోహర్‌నాయుడు, ఏపీ ప్రింటర్లు, పబ్లిషర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రగడ్డ మోహన్ సీఎంను ఆహ్వానించారు. వచ్చే ఏడాది జనవరి 2నుంచి 7వరకు బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు బుక్ ఫెస్టివల్ సొసైటీ పేర్కొంది. దక్షిణ భారత దేశంలోని పుస్తక పబ్లిషర్లు, ప్రింటర్లు, పాఠకులు పెద్దఎత్తున



హాజరు కానున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. అందరిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించటంపై బుక్ ఫెస్టివల్ సొసైటీని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

## సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబుని మంగళవారం ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆమె పలు అంశాలపై చర్చించారు. మహిళా సాధికారత దిశగా కమిషన్ భవిష్యత్ ప్రణాళికను సీఎంకు వివరించారు. అదేవిధంగా మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్త చర్యల్లో భాగంగా గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించి.. వారికి వైద్యసాయం అందించడంలో ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధను మహిళా కమిషన్ తరపున ఆమె సీఎంకు



ధన్యవాదాలు తెలియజేశారు. ఛైర్‌పర్సన్‌గా పదవిలోకి వచ్చిన అనతికాలంలోనే మహిళా కమిషన్‌కు మంచిపేరు తెచ్చిన రాయపాటి శైలజను సీఎం చంద్రబాబు అభినందించారు.

### నేడు పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు సెలవు

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**

నెల్లూరు (చైతన్య రథం): 'మొంథా' తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 29న బుధవారం నెల్లూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ పాఠశాలలకు, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించినట్టు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నార. ఈ ఉత్తర్వులను అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విధిగా అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# విపత్తు నిర్వహణకు సన్నద్ధం

**ఉప ముఖ్యమంత్రి పవన్ దిశానిర్దేశంతో పకడ్బందీ చర్యలు - గంట గంటకు పరిస్థితిని సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం**



పిఠాపురం (చైతన్య రథం): మొంథా తుపాను ప్రభావం పిఠాపురం నియోజకవర్గంపై తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తమైంది. విపత్తును ఎదుర్కోవడానికి సర్వసన్నద్ధమైంది. రౌండ్ ద క్లాక్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. నివేదికలు విశ్లేషించి అధికారులతో చర్చిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట తదితర తీర ప్రాంత గ్రామాల్లో సహాయక చర్యల పర్యవేక్షణకు గ్రామానికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. 34మంది సభ్యులతో ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందం పిఠాపురం నియోజకవర్గంలో అప్రమత్తంగా ఉంది. 34 బోట్లు సిద్ధం చేశారు. వీరికి తోడుగా 12మంది సభ్యుల క్విక్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు, 12మంది గజ ఈతగాళ్ళు ఉన్నారు. కాకినాడ జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ కాకినాడ జిల్లాలో ఉన్న తుపాను ప్రభావ పరిస్థితులను ఉప ముఖ్యమంత్రి సమీక్షిస్తున్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంట గంటకు నివేదికలు తీసుకుంటున్నారు. జిల్లాతోపాటు పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 25 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆహారం, తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలను సమకూర్చి, వైద్య ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు నేల కూలితే తక్షణమే స్పందించేలా వ్యవస్థను సన్నద్ధం చేయడంతోపాటు 500 స్తంభాలను స్టాండ్ బైగా ఉంచారు. అలాగే పశువులకు ఇబ్బంది లేకుండా అవసరమైన పశు గ్రాశాన్ని గ్రామాల్లో ఉంచారు. పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయం చేసుకొంటున్నారు. పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో పరిస్థితులను పర్యవేక్షించేందుకు గ్రామానికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. పునరావాస శిబిరాల్లో 12 వేలమందికి మధ్యాహ్న భోజనం, 15 వేలమందికి రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. 5 వేల పాల ప్యాకెట్లు, 1.5 లక్షల వాటర్ ప్యాకెట్లతోపాటు వాటర్ ట్యాంకర్లను సిద్ధం చేశారు.



# తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధం

- ప్రజలంతా చైతన్యవంతులై అప్రమత్తంగా వ్యవహరించాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలంతా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి
- ప్రతి 2 గంటలకోసారి ముఖ్యమంత్రి పరిస్థితిని సమీక్షిస్తున్నారు
- ప్రధాని కార్యాలయానికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాం
- మొంథా తుపాను ముందస్తు చర్యలపై మంత్రి నారా లోకేష్




అమరావతి (చైతన్య రథం): మొంథా తుపానువల్ల రాష్ట్రంలో సుమారు 40లక్షల మంది ప్రజలు ప్రభావితమవుతున్నారు. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అత్యధిక తీవ్రత కలిగిన ప్రాంతాలుగా గుర్తించాం. ఆ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపే అవకాశమున్నందున ఆ జిల్లాలు రెడ్ అలర్ట్‌లో ఉన్నాయి. ప్రజాప్రభుత్వం లక్ష్యం ఒక్కటే, ఎటువంటి ప్రాణనష్టం సంభవించకూడదు. ముఖ్యమంత్రి ఆదేశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హెూంమంత్రి అనితతో కలిసి మంగళవారం సాయంత్రం మంత్రి లోకేష్ మీడియాతో మాట్లాడారు. తుపాను సహాయ చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ఒకపక్క డిజాస్టర్ మేనేజర్‌మెంట్ మంత్రిగా అనిత, ఆర్టీజీఎస్ మంత్రిగా తాను సమన్వయంతో గత 24గంటలుగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామన్నారు. గత ఐదు రోజులుగా మొంథా తుపాను గమనాన్ని పరిశీలిస్తూ తుపాను ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నాం. ఈ రోజు రాత్రి 11.30కు అమలాపురం సమీపంలో తుపాను తీరం దాటబోతోంది. ఈ సందర్భంగా 90నుంచి 100 కి.మీల వేగంతో అక్కడ ఈదురు గాలులు వీచే అవకాశముంది. పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు.

## 1906 తాత్కాలిక షెల్టర్ల ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 23 నుంచీ నేరుగా తుపాను పరిస్థితిపై ముందస్తు పర్యవేక్షణ సాగిస్తున్నారు. యుఏఈకి వెళ్లే ముందు, అక్కడనుంచి వచ్చిన తర్వాత 12 రివ్యూ మీటింగ్‌లు, టెలీ కాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా తుపాను పరిస్థితులపై సమీక్ష జరిపారు. ప్రధాని నరేంద్రమోదీ సీఎంతో మాట్లాడి ముందస్తు ఏర్పాట్లపై వాకబు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రియల్ టైమ్ రిపోర్టులు పంపించింది. రాష్ట్రానికి ఏంకావాలన్నా సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రధానమంత్రి చెప్పారు. తుపాను ప్రభావం, ముంపు తీవ్రత అధికంగా ఉండే 1,328 గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 3,465 గర్భిణీలను తరలించి, వారికి కావాల్సిన పౌష్టికాహారం, నిత్యావసరాలను అందజేస్తున్నాం. 1,906 తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసి పునరావాసానికి అవసరమైన సామగ్రి అంతా పంపించాం. శానిటేషన్‌కు అవసరమైన బ్లీచింగ్ పౌడర్, లైమ్, ఇతర సామగ్రిని ఆయా గ్రామాలకు చేరవేశామని మంత్రి లోకేష్ వివరించారు.

## ఎన్ డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం

14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించాం. 364 స్కూళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చాం. ఈనెల 29వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేసి, నిషేధాజ్ఞలు విధించాం. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం 11 ఎన్‌డీఆర్ఎఫ్, 12 ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్‌లు, రిజర్వ్ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే రావడానికి ఆర్మీ కూడా హైదరాబాద్‌లో సిద్ధంగా ఉంది. 145 ఉడ్ కటింగ్ టీమ్స్ సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో చెట్లు పడిపోయిన చోట వారు సేవలందిస్తున్నారు. మెడికల్ అండ్ హెల్త్‌కు సంబంధించి 325 శిబిరాలు సిద్ధం చేశాం. 876 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు సైతం రెడీగా ఉన్నాయని మంత్రి వివరించారు.

## సహాయ చర్యలపై ముందస్తు ఏర్పాట్లు

తుపాను తీరం దాటిన తర్వాత పునరుద్ధరణ కార్యక్రమాలు కీలకం. ముఖ్యంగా విద్యుత్ శాఖకు సంబంధించి 11,347 స్తంభాలు, 1210 ట్రాన్స్ ఫార్మర్లు రెడీ చేశాం. సైక్లోన్ డైరెక్షన్‌ను బట్టి సేవలందించేందుకు 772 రెస్టోరేషన్ టీమ్స్‌ను కూడా సిద్ధంగా ఉంచాం. హాస్పటల్స్‌కు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా రోడ్లు కోతకు గురైతే వెంటనే పునరుద్ధరించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 7,289 జేసీబీ, క్రేన్స్, వాహనాలు సిద్ధంగా ఉంచాం. తాగునీటికి సంబంధించి వాటర్ ట్యాంకర్లను రెడీ చేశాం. తుపాను సమయంలో ప్రధానంగా ప్రభావితమయ్యేది సీపీడబ్ల్యూ స్కీమ్స్. తిత్లీ అనుభవాలతో ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో పక్కాగా చర్యలు చేపట్టి 1,037 డీజిల్ జనరేటర్లను ఆయా ప్రాంతాలకు పంపించాం. ఎయిర్ టెల్, జియో, ఇతర సర్వీసు ప్రొవైడర్లు సెల్ ఫోన్ టవర్లకు అవసరమైన డీజి సెట్లు సిద్ధం చేశారు. డీజిల్ కూడా అందుబాటులో ఉంచామని లోకేష్ వివరించారు.

## రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం కలెక్టర్లందరికీ నిధులు విడుదల చేశాం. ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ప్రధాన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఆర్టీజీఎస్‌లో రాత్రంతా బసచేసి రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. ముఖ్యమంత్రి ప్రతి 2గంటలకు ఒకసారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మొంథా తుపాను తీరందాటాక వెనువెంటనే డ్రోన్స్, లోలెవల్ ఫ్లయింగ్ వెహికల్స్‌తో పంట నష్టం, ఇళ్లు, ఆస్తి నష్టంపై రియల్ టైమ్ ట్రాకింగ్‌పెట్టి యుద్ధప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు ప్రారంభిస్తాం. ప్రభుత్వం ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. దయచేసి ప్రజలంతా ఇళ్లలోనే ఉండండి. బీచ్‌లు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దు. అధికారులు చెప్పిన జాగ్రత్తలు పాటించండి. 100కి.మీ.ల వేగంతో తుపాను వస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బంది పడతాం. ఈ సమయంలో బీచ్‌ల దగ్గరకు వెళ్లడం మంచిది కాదు. ఈ రాత్రి 11.30 గంటలనుంచి పరిస్థితి చాలా క్రిటికల్‌గా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల భారీ వర్షాలు పడుతున్నాయి. తీరం దాటాక కూడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలోనే

ఈరోజు ఉదయం హెూంమంత్రి, తాను.. ఎమ్మెల్యేలు, ఎంపీలతో మాట్లాడాం, వారినుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. గోపాలపురం ఎమ్మెల్యే ఎర్రకాలువ సమస్య ఉందన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాం. తుపాను తీరం దాటాక క్షేత్రస్థాయిలో గ్రామాలు, పంటపొలాలకు వెళ్లి సహాయ పునరావాస చర్యల్లో పాల్గొనాల్సిందిగా ప్రజాప్రతినిధులకు సూచించాం. ఇప్పుడు మా దృష్టి అంతా ప్రజలను చైతన్యవంతంచేసి, అప్రమత్తం చేయడమే. ప్రభుత్వం ఈనెల 23నుంచే అప్రమత్తంగా ఉంది. ముఖ్యమంత్రి ఇప్పటికి 12సార్లు సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులంతా ఫీల్డ్‌లోనే ఉన్నారు. విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవితో సహా మంత్రులంతా తుపాను ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మంత్రులతోపాటు అందరూ అప్రమత్తంగా ఉన్నారు. దీనిని తేలిగ్గా తీసుకోకుండా సీరియస్‌గా పనిచేస్తున్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## ఆర్టీజీఎస్‌లో అవేర్ ప్లాట్ ఫాం

తుపాను తీరం దాటిన తర్వాత యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరిస్తాం. తుపాన్లను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రికి ఎంతో అనుభవముంది. ఆయన 1996 కోనసీమ తుపాను, హుద్‌హుద్, తిత్లీ సమయంలో సమర్థవంతమైన సేవలు అందించారు. గత 5 రోజులనుంచి మేమంతా ప్రిపరేషన్‌లో ఉన్నాం. చెట్లు కూలిపోయినపుడు వాటిని తొలగించే వరకు ఫాలో అప్ మెకానిజం ఏర్పాటుచేశాం. హెూంమంత్రి మానిటర్ చేస్తున్నారు. 10 నిమిషాల్లో క్లియర్ చేయాలని సీఎం ఆదేశించారు. ప్రజాప్రతి నిధులతో నేను మాట్లాడాను. అందరూ సిద్ధంగా, అప్రమత్తంగా ఉన్నారు. ప్రమాదం సంభవించకుండా చాలాప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీలు తొలగించాం. తుపానుకు సంబంధించి పూర్తిస్థాయి డేటా మాకు ఎప్పటికపుడు వస్తోంది. ఆర్టీజీఎస్‌లో అవేర్ ప్లాట్‌ఫాం ఏర్పాటుచేశాం. రియల్ టైమ్ మానిటర్ చేస్తున్నాం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్, రిలీఫ్, రిహాబిలిటేషన్ ఇంటిగ్రేషన్ చేస్తున్నాం. వాట్సాప్, ఎస్ఎంఎస్, వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

## అన్నిశాఖలూ సర్వసన్నద్ధం

సహాయ చర్యల్లో ఎక్కడా అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. 99శాతం కచ్చితత్వంతో మాకు సమాచారం అందుతోంది. రియల్ టైం సమాచారాన్ని, ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రధాని కార్యాలయానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. ప్రధానిమంత్రి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. పీఎంఓ కూడా మానిటర్ చేస్తోంది. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులంతా తుపాను పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. వివిధ రకాల సోర్స్ ద్వారా డేటా సేకరిస్తున్నాం. శాటిలైట్ మ్యాప్స్ కూడా తీసుకుంటున్నాం. ప్రజలను అప్రమత్తం చేసి చైతన్యం తేవడమే మా లక్ష్యం. ఇది రాజకీయాలకు సమయం కాదు. ప్రజలకు సేవలందించేందుకు అన్నిశాఖలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో హెూం మంత్రి అనిత పాల్గొన్నారు.

---

# 'సుప్రీం' తీర్పుపై రివ్యూ పిటిషన్

- టెట్ విషయంలో టీచర్ల ఆకాంక్షలు అర్థం చేసుకున్నా
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను: మంత్రి లోకేష్
- సచివాలయంలో మంత్రి లోకేష్‌ను కలిసిన టీడీపీ ఎమ్మెల్సీలు
- ఉపాధ్యాయుల ఆవేదనను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వైనం



అమరావతి (చైతన్య రథం): టెట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేస్తామని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరన్న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ సచివాలయంలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. 2010 అక్టోబరు 23కి ముందు డీఎస్సీల ద్వారా ఎంపికైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల ఆందోళన నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేయాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం 01-09-25 నాటికి రిటైర్మెంట్‌కు 5 ఏళ్లు పైబడి సర్వీస్ కలిగిన టెట్ పాస్‌కాని ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా టెట్ క్వాలిఫై కావాలని ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు అనుగుణంగా 24-10-25న టెట్ నోటిఫికేషన్‌ను జారీ చేయడం జరిగింది. 20నుంచి 25 ఏళ్ల వరకు సర్వీస్ పూర్తిచేసిన తర్వాత టెట్ క్వాలిఫై కానిపక్షంలో ఉపాధ్యాయులుగా అనర్హులపై సుప్రీం ఉత్తర్వులతో టీచర్ల తీవ్ర ఆవేదనను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్నవారు కూడా ప్రమోషన్ పొందాలంటే టెట్ తప్పనిసరి అని పేర్కొన్నారని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టెట్ నిర్వహిస్తామని తెలియజేస్తూనే ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా సుప్రీంకోర్టులో రాష్ట్రప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని హామీ ఇచ్చారు.

చైతన్యరథం

# తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొనాలి


**ప్రజల భద్రత మన ప్రథమ కర్తవ్యం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



అమరావతి(చైతన్యరథం): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు. నాయకులు..అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని సహాయక చర్యల్లో పాల్గొనాలని, ప్రజల భద్రతే మన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. తీరప్రాంతం, కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ఇప్పటికే ప్రభుత్వం సురక్షిత వసతిగృహాలకు తరలించిందని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో ముందుండి సేవలందిస్తున్నారని తెలిపారు. రాబోయే 48 గంటల పాటు కూడా ఇదే నిబద్ధత కొనసాగించాలని సూచించారు. సీఎం చంద్రబాబు స్వయంగా సమీక్షిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. యువనేత లోకేష్ రెండు రోజులుగా ఆర్టీజీఎస్ కంట్రోల్ రూమ్‌లో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, ఫీల్డ్ స్థాయి సమస్యలను రియల్ టైమ్‌లో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ సోషల్ మీడియాలో పాత చిత్రాలు, వీడియోలను ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాన్ని రేకెత్తించడాన్ని ఖండించారు. ఈ విపత్తు సమయంలో రాజకీయాలను పక్కనపెట్టి ప్రజల భద్ర తకే ప్రాధాన్యత ఇవ్వాలి. సహాయం చేయలేకపోయినా కనీసం అబద్ధపు ప్రచారాలతో భయం వ్యాప్తి చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని హితవుపలికారు.

# హెూంమంత్రి అనిత టెలీ కాన్ఫరెన్స్

**- పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లపై సూచనలు**



అమరావతి(చైతన్యరథం): మొంథా తుఫాన్ నేపథ్యంలో పాయ కరావుపేట నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో హెూంమంత్రి వంగలపూడి అనిత టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సముద్రతీర ప్రాంతాల్లో నివసిస్తున్న మత్స్యకార కుటుంబాలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించా లని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావంతో చెట్లు కూలి న చోట్ల వెంటనే పొక్లెయినర్లు, క్రేన్ల సాయంతో తొలగించాల న్నారు. అలాగే నియోజకవర్గంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని చెప్పారు. బంగారమ్మపాలెం, సోమిదేవిపల్లి, రాజయ్య పేట గ్రామాల్లో తక్షణ చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించా లన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

**హాస్టళ్లలో ఉండే వారిని కాపాడుకుందాం : బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



తాడేపల్లి/అమరావతి(చైతన్యరథం): మొంథా తుఫాన్ నుంచి బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుందామని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తుఫాన్ తీవ్రంగా ఉండే ప్రాంతాల్లోని విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలతతో మంత్రి మంగళవారం సమీక్షించారు.

మొంథా తుఫాన్ నేపథ్యంలో బీసీ హాస్టళ్ల విద్యార్థుల రక్షణకు తీసుకున్న చర్యల గురించి జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నా రు. పలువురు డీబీసీడబ్ల్యూవోలతోనూ మంత్రి స్వయంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మాట్లాడుతూ వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, ప్రిన్సిపాళ్లు 24 గంటలూ హాస్టళ్లలో ఉండడడంతో పాటు రాత్రి సమయంలో విద్యార్థులతో కలిసి నిద్రపోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పు డు జిల్లా కలెక్టర్ల ఆదేశాలను తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పీహెచ్‌సీ వైద్యులతో సేవలందించాలని సూచించారు. హాస్టళ్లలో పరిశు భ్రత, జాగ్రత్తలపై సూచనలు చేశారు. తుఫాన్ దృష్ట్యా హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను నిరంతరం పర్యవేక్షిం చాలని, ఎప్పటికప్పుడు వాటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

# పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు

**మంత్రి వాసంశెట్టి సుభాష్**



మచిలీపట్నం(చైతన్యరథం): తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవా రం ఉదయం మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి మచిలీపట్నం మండలం తాళ్లపాలెం పంచాయతీ గిరిపురంలో మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరి శీలించారు. అక్కడి ప్రజల బాగోగులను అడిగి విచారించారు. అనంతరం మంగినపూడి బీచ్‌ను సందర్శించి ఎగిసిపడుతున్న అలలను, బలమైన ఈదురుగాలులను పరిశీలించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతా లు, ప్రమాదాలు ప్రాంతాల నుంచి ప్రజలను తరలించేందుకు 222 సురక్షిత పునరావాస కేంద్రాలను గుర్తించామని, అవసరాన్ని బట్టి 162 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో ప్రస్తు తం ఉన్న 2,497 కుటుంబాలకు కావలసిన మంచినీరు, ఆహారం తదితర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. జిల్లాలో రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

**తుఫాన్‌పై రైతులు ఆందోళన చెందవద్దు**

# ప్రభుత్వం అండగా ఉంటుంది

**- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు**



అమరావతి (చైతన్యరథం): తుఫాన్‌పై రైతుల్లో ఆందోళన చెందవద్దని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గతంలో కూడా తీవ్ర ప్రకృతి విపత్తులను సీఎం చంద్రబాబు నాయ కత్వంలో విజయవంతంగా ఎదుర్కొన్నాం. ఈసారి పక్కా ప్రణాళి కలతో ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాస్త్ర వేత్తలు, అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. వ్యవసాయ, ఉద్యాన పంటల ప్రాథమిక నష్ట అంచనా నివేదికలు సేకరించాం. ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు నష్ట నివారణ చర్యలు చేపట్టాం. తుఫాను అనంతరం నష్టం వాటిల్లిన ప్రతి రైతును ప్రభుత్వం పూర్తిగా ఆదు కుంటుంది. మత్స్యకారులను అప్రమత్తం చేసి వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నాం. వారి వలలు, బోట్లు రక్షించుకునే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూగజీవుల ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్య లు చేపట్టాం. ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన మంత్రి సంధ్యారాణి




పార్వతిపురం మన్యం (చైతన్యరథం): మొంథా తుఫాన్ నేపథ్యం లో పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పరిశీలించారు. జిల్లాలోని ప్రాజెక్టులలో నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎటువంటి నష్టాలు చవిచూ డకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ఏర్పాటైన కంట్రోల్ రూమ్‌లలో తహసీల్దారు, ఎంపీడీ వో ఇతర అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించా రు. ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్కూల్స్, కాలేజీలకు 3 రోజులు, అంగన్‌వాడీ సెంటర్లకు 4 రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. అనంతరం అదే వీధిలో హాస్టల్ పరిస్థితి పరిశీలించారు. అవసరమైతే సెలవులను పొడిగించే అవకాశం ఉందని తెలిపారు.

# గోపాలపురం ఎమ్మెల్యేకు మంత్రి లోకేష్ ఫోన్

**- తుఫాన్ సన్నద్ధత చర్యలపై ఆరా**

**- ఆర్టీజీఎస్ నుంచి స్వయంగా సమీక్ష**

నల్లజర్ల(చైతన్యరథం): గోపాలపురం ఎమ్మెల్యేకు మంత్రి లోకేష్ ఆర్టీజీఎస్ నుంచి ఫోన్ చేశారు. తుఫాన్ సహాయక చర్యలపై అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగంతో కలిసి సిద్ధంగా ఉన్నామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంటకరాజు తెలి పారు. రైతులతో కలిసి ఎర్రకాలువ గట్లను పరిశీలిస్తున్న సమ యంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఎమ్మెల్యేకు ఫోన్ వచ్చింది. నియోజకవర్గంలో ముంపు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితిని లోకేష్ ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బందులు ఉన్నచోట నుంచి పున రావాస కేంద్రాలకు తరలించాలని మంత్రి లోకేష్ సూచించ గా...పునరావాసాలకు తరలించడంతో పాటు 10 వేల మంది ఆహారాన్ని, తాగునీటిని కూడా సిద్ధం చేసి ఉంచామని మద్దిపాటి వివరించారు. పొలాలు ముంపుబారిన పడకుండా డ్రెయిన్లు క్లియర్ చేసే అంశంపైనా దృష్టిపెట్టాలని లోకేష్ అన్నారు. రైతులతో కలిసి ట్రాక్టర్‌లో పంటలను పరిశీలించామని, కాల్వలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని మద్దిపాటి వివరించారు. ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని లోకేష్ సూచించారు.

# ప్రకాశం జిల్లాలో 65 పునరావాస కేంద్రాలు

- మంచినీరు, ఆహారం, పాలు, మందుల సరఫరా
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

ఒంగోలు(చైతన్యరథం): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధమై ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. మంగళవారం కలెక్టరే ట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించారు. తుఫాన్‌పై తీసుకుం టున్న చర్యలను కలెక్టర్ పి.రాజాబాబు మంత్రికి వివరించారు. అనంతరం అధికారుల తోనూ మంత్రి సమీక్షించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలతో కలిసి విలేకరులతో మంత్రి మాట్లాడారు. గత తొమ్మిది రోజుల నుంచి వర్షం కురుస్తున్నప్ప టికీ జిల్లాలో ఎటువంటి సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలను అభినందించా రు. మరో రెండు రోజుల పాటు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచిం చారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 65 పునరావాస కేం ద్రాలను ఏర్పాటు చేసి 2900 మందిని వాటిలోకి తరలించినట్లు చెప్పారు. వీరికి అవసరమైన అల్పాహారం, భోజనం, ఇతర సౌకర్యాలను కల్పించిన ట్లు తెలిపారు. దురుద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాపింపచేసే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



**తీరప్రాంతాల్లో 219 తుఫాన్ షెల్టర్లు**

కొండపి: మొంథా తుఫాన్ నేపథ్యంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్య టించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపా లెం, పల్లెపాలెంలో పర్యటించారు. పాకలలో పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. జోరు వర్షంలోనూ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆందోళన వద్దు, అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టింది. సహాయ చర్యల కోసం అత్యవస రంగా రూ.19 కోట్లు విడుదల చేశాం. రాష్ట్రంలోని 57 తీర ప్రాంత మం డలాల పరిధిలో 219 తుఫాన్ షెల్టర్లు ఏర్పాట్లు చేశాం. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించాం. విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు చర్యలు

**- ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



అమరావతి (చైతన్యరథం): మొంథా తుఫాన్ ప్రభావం, క్షేత్రస్థాయి పరిస్థితులపై ముంబాయి నుంచి ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీక్షించారు. రాబోయే 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. మొంథా తుఫాన్ కారణంగా ఈ రోజు సాయంత్రం నాటికి దాదాపుగా 1632 కి.మీ మేర ఆర్అండ్‌బీ రహదారులు ధ్వంసం అయినట్లు చెప్పారు. 69 చోట్ల గుంతలు, గోతులతో దెబ్బతినగా.. ఇప్పటివరకు 16 చోట్ల పునరుద్ధరించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 21 చోట్ల రహదా రులు కోతకు గురికాగా ఆరు చోట్ల పునరుద్ధరణ పనులు చేపట్టి ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా చేశాం. మొత్తంగా కల్వర్టులు దాదాపు 144 చోట్ల ధ్వంసం కాగా, ఇప్పటివరకు 36 చోట్ల పునరుద్ధరించాం. భారీవర్షాలకు తోడు, తీవ్ర గాలివానతో రహదా రులపై 66 చోట్ల వృక్షాలు నేలకొరగగా, 62 చెట్లను ఇప్పటికే క్లియర్ చేశారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలతో దాదాపుగా 130 చోట్ల రోడ్లపై నుంచి నీరు ప్రవహించే పరిస్థితి. 92 చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే, ఇప్పటి వరకు దాదాపు 21 చోట్ల ట్రాఫిక్‌ను పునరుద్ధరించినట్లు చెప్పారు. ఇప్పటివరకు ధ్వంసమైన రోడ్ల తాత్కాలిక పునరుద్ధరణకు రూ.98.71 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు దాదాపు రూ.897.38 కోట్లు అవసరమని అంచనా వేశారు.

# పునరావాస కేంద్రాల్లో 75వేలమంది



అమరావతి (చైతన్య రథం): మొంథా తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. తీవ్ర తుపాను కోస్తాంధ్రలోని విశాఖ, ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 403 మండలాలపై మొంథా తుపాను ప్రభావం ఉండనుందని, అత్యవసర పరిస్థితి ఎదుర్కోనేలా మండలాల వారీగా 488 కంట్రోల్ రూములను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. మొత్తం 1204 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 75,802 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. 219కి పైగా మెడికల్ క్యాంపులను వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అత్యవసర సమాచార వ్యవస్థ కోసం 81 వైర్‌లెస్ టవర్లను సైతం రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిందని అధికారులు తెలిపారు. 21కి పైగా భారీ సైజు ఆస్కా ల్యాంపులను కూడా సిద్ధం చేసింది. 1147 జేసీబీలు, ప్రొక్లెయిన్లు, క్రేన్లు. 321 డ్రోన్లను సర్కారు సిద్ధంగా ఉంచింది. కూలిన చెట్లు తొలగించేందుకు 1040 యాంత్రిక రంపాలను సిద్ధం చేసింది. తుపాను ప్రభావంపై ఇప్పటి వరకు 3.6 కోట్ల మందికి మొబైల్ ఫోన్ల ద్వారా హెచ్చరిక సందేశాలు జారీ చేసింది. వర్షప్రభావం రీత్యా 865 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని అధికారులు సిద్ధం చేశారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 38 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా. 1.38 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయి.

# సముద్రంలో చిక్కుకున్న జాలర్లు సురక్షితం

బ్రహ్మపుర నగరం (చైతన్య రథం): 'మొంథా' తుపాను ప్రభావంతో ఒడిశాలోని గంజాం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చేపల వేటకు వచ్చిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 60 ట్రాలర్లు ఛత్రపురం సమీపంలో అర్జిపల్లి వద్ద సముద్రంలో చిక్కుకున్నాయి. తక్షణమే స్పందించిన జిల్లా యంత్రాంగం మొత్తం 60 ట్రాలర్లను గోపాల్పూర్ ఓడరేవులో లంగర్లు వేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఆయా ట్రాలర్లలోని 600మందిని సురక్షితంగా కాపాడి, వారికి ఆహారం, తాగునీరు, ఔషధాలు అందజేసినట్టు మత్స్యశాఖ ఉపసంచాలకుడు సంగ్రామ్ కర్ మీడియాకు తెలిపారు. తుపాను ప్రభావం తగ్గే వరకు వారికి అండగా ఉంటామని చెప్పారు. మత్స్యకారులకు పునరావాస చర్యలపై గంజాం కలెక్టర్ కీర్తివాసన్ ఆరా తీశారు.



# తుఫాన్ సహాయక చర్యలను పర్యవేక్షించాలి

**- మంత్రి నిమ్మల రామానాయుడు**

**- బియ్యపుతిప్ప పునరావాస కేంద్ర పరిశీలన**




నరసాపురం (చైతన్యరథం): పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలోని సముద్ర తీర గ్రామాల్లో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటిం చారు. బియ్యపుతిప్ప గ్రామంలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి గ్రామస్తులకు అందుతున్న సహాయక చర్యలను తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి నరసాపురం సముద్రతీర గ్రామాల్లోనే పర్యటి స్తూ అధికారులతో సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. తుఫాన్ అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉండటంతో ముందస్తు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మట్టి, పూరిళ్ల లో ఉండే వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలిం చడం జరిగింది. చెట్లు కూలడం వల్ల ఇతరత్రా ఇబ్బందులు తలెత్త కుండా కట్టర్స్, జేసీబీలు వంటి యంత్ర సామగ్రి అందుబా టులో ఉంచుకునేలా ఆర్అండ్‌బీ శాఖను సన్నద్ధం చేసినట్లు చెప్పారు. కరెంట్ కోతలకు అంతరాయం లేకుండా పశ్చిమగోదావరి జిల్లాలో 800 మంది సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. పట్టణ, మండల, గ్రామస్థాయిల్లో, మున్సిపల్, రెవెన్యూ, పంచాయితీ సిబ్బంది ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు పర్యవేక్షించాలని సూచించారు.

# విద్యుత్ సిబ్బంది అలెర్ట్‌గా ఉండాలి

**- మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**- పశ్చిమగోదావరి అధికారులతో సమీక్ష**




భీమవరం (చైతన్యరథం): పశ్చిమగోదావరి జిల్లా కమాండ్ కంట్రోల్ రూంను మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సందర్శించారు. తుపాను పరిస్థితులపై జిల్లా అధికా రులతో సమీక్షించారు. బియ్యపుతిప్ప, వేముల దీవి ప్రజలను నరసాపురం పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. తుఫాను తీరం దాటే వరకు 24 గంటలు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో అధికారులు అలెర్ట్‌గా ఉండాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాల్వలు, డ్రైన్ల ద్వారా ఎప్పటికప్పుడు నీటిని బయటకు పంపాలి. కరెంటు తీగలు తెగి ప్రమాదాలు సంభవించ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా నిలుపుదల, హెచ్చుతగ్గులపై ప్రజలకు ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

# 233 మండలాలు 44 మున్సిపాల్టీలపై ఎఫెక్ట్

అమరావతి: ఏపీవ్యాప్తంగా మొందా తుపాను ప్రభావాన్ని కనిపించింది. కోస్తా జిల్లాల్లో భారీ, కొన్నిచోట్ల అతి భారీ వర్గాలు కురిశాయి. రాయలసీమ జిల్లాల్లోనూ పలుచోట్ల మోస్తరు వానలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 233 మండలాలు, 1,419 గ్రామాలు, 44 మున్సిపాలిటీలపై తుపాను ప్రభావం ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే 2,194 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించింది. 3,465మంది గర్భిణీలు, బాలింతల సంరక్షణ కు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపింది. 19 జిల్లాల పరిధిలోని 54 రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం వెల్లడించింది. జిల్లాల్లో కమ్యూనికేషన్ కోసం 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు ఏర్పాటు చేశామని తెలిపింది. 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసింది.

# నేటి నుంచే పత్తి కొనుగోలు కేంద్రాలు



- కనీసం మద్దతు ధర రూ.8,110
- సక్రమంగా కొనుగోలు ప్రక్రియకు చర్యలు
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర రైతాంగానికి ఉపశమనం కల్పించేలా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను బుధవారం నుంచే ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 30 కొనుగోలు కేంద్రాలలో తక్షణమే పత్తి సేకరణ చేపట్టా లని సీసీఐ, సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఈ సంద ర్భంగా 2025-26 సంవత్సరానికి 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగైనట్లు, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాలుకు రూ.8,110 కనీస మద్దతు ధరను రైతులకు అందిం చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పత్తి అమ్ము కోవాలనుకునే రైతులు కొనుగోలు ప్రక్రియను సక్రమంగా పాటిం చాలని సూచించారు. రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా తమ వివరాలను సీఎం యాప్‌లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత "కపాస్ కిసాన్" యాప్‌లో అదే వీఏఏ సహాయంతో స్లాట్ బుక్ చేసుకొని, స్లాట్ ప్రకారం సిసిఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు కేంద్రాల ద్వారా (జిన్నింగ్ మిల్లుల ద్వారా) మాత్రమే పత్తిని అమ్ముకోవాలని కోరారు. ఇందుకోసం జిల్లా వ్యవసాయ అధికారులు, మార్కెటింగ్ అధికారులు దిగువ స్థాయి సిబ్బందికి తగు సూచనలు ఇస్తూ, వీఏఏ లు రైతులకు పూర్తి సహకారం అందించేలా పర్యవేక్షించి, కొనుగోలును విజయవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

# పెట్టుబడులకు అనువైన కేంద్రం ఏపీ

- అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఇండియా మారిటైమ్ వీక్‌లో ప్రసంగం




ముంబై/అమరావతి (చైతన్యరథం): ముంబైలో మంగళవారం జరిగిన ఇండియా మారిటైమ్ వీక్-2025 కార్యక్రమంలో పెట్టు బడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రసంగించారు. భారతదేశ సముద్ర తీరప్రాంతం శక్తి, వారసత్వం, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి ప్రపంచానికి తెలియజెప్పేందుకు ఈ ఏడాది నిర్వహిస్తున్న ఇండియా మారిటైమ్ వీక్‌లో ఏపీ ప్రజలు, ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించడం నిజంగా గర్వకారణంగా ఉందన్నారు. 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంతో దేశంలో రెండవ అతిపెద్ద తీరరేఖను కలిగి ఉన్న ఏపీ భారతదేశ తూర్పు తీరానికి సముద్ర ద్వారం (మారిటైమ్ గేట్ వే ఆఫ్ ఈస్ట్ కోస్ట్)గా నిలవడంతో పాటు, దేశాన్ని ఆసియా, తూర్పు ఆసియా దేశాల ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానిస్తోందని వివరించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 6 ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయని, విశాఖపట్నం పోర్ట్.. తూర్పు తీరంలోని మొత్తం సరకు రవాణాలో సుమారు 30 శాతం నిర్వహిస్తుందని వివరిం చారు. నాలుగు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ఆటోమేషన్, మరియు వ్యర్థాన్ని శక్తిగా మార్చే వ్యవస్థలు సమగ్రంగా ఉంటాయి. ఈ కొత్త పోర్టులు మొత్తం 350 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని కలిగి ఏపీని భారత తూర్పు తీర సముద్రాభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలుపుతుందని తెలిపారు. హై స్పీడ్ హైవేలు, సరకు, రైల్వే మార్గాలు, అంతర్గత జలమార్గాల ద్వారా సమగ్ర లాజిస్టిక్స్, కనెక్టివిటీ కోసం ఒక ఏకో సిస్టమ్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సహ కారంతో విశాఖ పట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లు, పోర్టులను పారిశ్రామిక ఉత్పత్తి జోన్‌లతో కలుపుతూ వస్తువుల రవాణాను సులభతరం చేసేందుకు ప్రాంతీయ సమతుల్య అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. 900 కి.మీకు పైగా నావిగేట్ చేయగల అంతర్గత జలమార్గాలను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో నేషనల్ వాటర్ వే-4 కూడా ఉందని చెప్పారు. ఇది కాకినాడ, రాజమండ్రి, విజయవాడలను అనుసంధానిస్తూ తక్కువ ఖర్చుతో, పర్యావరణ హిత మైన సరకు రవాణాను ప్రోత్సహిస్తుందని వివరించారు. దుగ్గరాజు పట్నంలో మేము భారీ నౌకా నిర్మాణ, మరమ్మతు క్లస్టర్‌ను అభివృ ద్ధి చేస్తున్నాం.. ఇది రక్షణ, వాణిజ్య నౌకలకు సేవలందించడానికి రూపొందించబడింది. ఈ ప్రాజెక్టు నైపుణ్యంతో కూడిన ఉపాధిని సృష్టించడమే కాకుండా "ఆత్మనిర్భర భారత్" లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లి ఆంధ్రప్రదేశ్‌ను తూర్పు తీరంలోని సముద్ర తయారీ కేంద్రంగా నిలబెడుతుంది. అదనంగా ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నంలలో ఫిషింగ్ హార్బర్స్, ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తూ, తీర ప్రాంత ప్రజలను బలోపేతం చేస్తున్నాం.. దీంతో దేశంలో సముద్ర ఆహార ఎగుమతుల సామర్థ్యం మరిం తగా పెరుగుతుంది. విజనరీ లీడం నాయకత్వంలో ఏపీ నిరంత రంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో నిలుస్తోంది. మా పరిశ్రమల అభివృద్ధి పాలసీ, లాజిస్టిక్స్ పాలసీలు దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన ప్రోత్సాహాలను అందిస్తున్నాయి. 10 సంవత్సరాల పాటు నికర రాష్ట్ర జీఎస్టీలో 100% వరకు రీయింబర్స్‌మెంట్, పోర్ట్..షిప్‌యార్డ్ మౌలిక సదుపాయాలకు మూలధన పెట్టుబడి మద్దతు, ఆర్అండ్‌డీ ట్రైనింగ్ సపోర్ట్, విద్యుత్..నీటి టారిఫ్‌ల సడలింపు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు ఇస్తున్నట్లు వివరించారు. షిప్‌బిల్డింగ్, సముద్ర తయారీ రంగాలకు ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్‌లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 21 రోజు లలోపే పూర్తిస్థాయి అనుమతులను అందించనున్నట్లు తెలిపారు. ఏపీ మారిటైమ్ బోర్డు అన్ని తీర ప్రాంత సంబంధిత పెట్టుబడు లకు ఏకైక కేంద్రంగా పనిచేస్తూ పారదర్శకత, స్థిరత్వం, విశ్వాసాన్ని అందిస్తోందని వివరించారు. అపార అవకాశాలతో నిండిన మారిటైమ్ భవిష్యత్తును నిర్మించేందుకు తమతో భాగ స్వాములై కలిసి ముందుకురావాలని కోరారు. ఈ కార్యక్రమం లో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, విశాఖ పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, ఏపీ ఎయిర్‌పోర్టు అథారిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రవీ ణాదిత్య, మారిటైమ్ బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జడ్.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్‌పై మంత్రి గొట్టిపాటి సమీక్ష

- పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



నర్సాపురం (చైతన్యరథం): నర్సాపురంలో పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. ఆయన వెంట ఎమ్మెల్యే నాయకర్ ఉన్నారు. నాగిడిపాలెం, పాతపాడు, కాళీపట్నం పునరావాస కేంద్రాలను పరిశీలించారు. తుఫాన్ సహాయక చర్యలను కలెక్టర్, ఎస్పీ వివరించారు. తుపాను ముప్పు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రంలో ఏర్పాట్లపై సూచనలు చేశారు. తుపానును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉంది. విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బం దులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చూడాలి : ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం: అధికారుల సమన్వయంతో జిల్లాలో మొంథా తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టి సిద్ధంగా ఉన్నామని గనులు భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మొంథా తుపాను జిల్లా ప్రత్యేక అధికారి, పర్యాటక శాఖ ఎండీ, కాట ఆమ్రపాలి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయ ణరావుతో కలసి తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలపై సమీక్షించారు. తీరం దాటే సమయంలో అధిక వర్షాలు కురిసిన ప్పుడు నగరంతోపాటు పంట పొలాలకు ముంపు ప్రభావం తలెత్త కుండా ఉండేందుకు ముందుగానే ప్రధాన డ్రైనేజీలు అయిన శివగంగ, గుండేరు, లజ్జబండ మురుగు కాలవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల కట్టలను బలోపేతం చేయా లని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి జిల్లా ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితులను సమీక్షిస్తోందన్నారు. ఈ విపత్తు వల్ల ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ఉండే విధంగా ప్రభుత్వ పరంగా అన్ని రక్షణ చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

## తుఫాన్ ప్రాంతాల్లో మంత్రి కొలుసు పర్యటన

- గండి తెగిన చెరువులు, పరిస్థితులు పరిశీలన
- తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు



నూజివీడు (చైతన్యరథం): మొంథా తుఫాను ప్రభావిత ప్రాం తాల్లో గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం పర్యటించారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం, నెక్కలం గొల్లగూ డెం, ఆగిరిపల్లి గ్రామాల్లో పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో గండ్లు తెగిపోయిన చెరువుల వద్ద మంత్రి పర్యటిం చారు. గండ్లు తెగిపోయిన చెరువుల వద్ద తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగ కుండా అవగాహన కల్పించారు. ప్రజలంతా సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, అధికారులు చెప్పే సూచనలు తప్పకుండా పాటించాలని కోరారు. పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు గండ్లు తెగిన చెరువుల వద్ద నిఘా పెట్టాలని, ఎలాం టి ప్రాణనష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు



అల్లూరి జిల్లాలో ఉగ్రరూపం దాల్చి ప్రమాదకరంగా ప్రవహిస్తోన్న గోస్తనీ నది



ఛిద్రమైన ఉప్పాడ రహదారి

- పలుచోట్ల కుప్పకూలిన భారీవృక్షాలు
- యారాడలో విరిగిపడిన కొండ చరియలు
- ప్రమాదస్థితిలో పారుతున్న వాగులు, చెరువులు
- ముంపునకు గురైన కాలనీలు, రహదారులు
- తుపాను వర్షంతో జనజీవనం అస్థవ్యస్థం
- విశాఖవైపు వెళ్లే రైళ్లు రద్దు
- నిలిచిన ఇండిగో, ఎయిరిండియా విమాన సర్వీసులు
- పునరావాస కేంద్రాలకు తరలిన లోతట్టు ప్రజలు

అమరావతి (చైతన్య రథం): మొంథా తుపాను ప్రభావంతో ఏపీవ్యాప్తంగా తీరప్రాంత జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆయా జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు మండలాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. మంగళవారం సాయంత్రంనుంచి గాలుల తీవ్రత మరింత పెరగడంతో.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేశ్ కుమార్ హెచ్చరించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో కెరటాల ఉధృతి మరింత పెరిగింది. ఈ ప్రభావంతో ఉప్పాడనుంచి కాకినాడ వెళ్లే బీచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

తుపాను ప్రభావంతో విశాఖ జిల్లాలో రాత్రినుంచి వర్షం కురుస్తోంది. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. తుపాను కారణంగా విశాఖకు వచ్చే 16 రైళ్లు రద్దయ్యాయి. ఇండిగో, ఎయిరిండియా విమాన సర్వీసులూ నిలిచిపోయాయి. తుపాను సహాయక చర్యల కోసం తూర్పు నౌకాదళం సన్నద్ధమైంది. జ్ఞానాపురం రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డు నీటమునిగింది. ఆరిలోవ రామకృష్ణాపురం ప్రాంతంలో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు పదేపదే సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. శ్రీకృష్ణాపురం ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు చెట్లు కూలిపోయాయి. విద్యుత్ తీగలపై పడి సరఫరాకు అంతరాయం కలిగింది. మరోవైపు గాజువాకనుంచి యారాడ వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.

గుంటూరు జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, కాకుమాను, ప్రత్తిపాడు, పెదనందిపాడు, తాడికొండ, తుళ్లూరు, మేడికొండూరు మండలాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 72 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జీఎంసీ పరిధిలోని మూడు నియోజకవర్గాలను ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు.

బాపట్ల జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అధికార, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నిజాంపట్నం హార్బర్‌లో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లద్దని అధికారులు హెచ్చరించారు. ఇక పల్నాడు జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, గురజాల సహా పలుచోట్ల వానలు పడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలూ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. ప్రకాశం జిల్లావ్యాప్తంగా రాత్రి నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. తీరప్రాంత గ్రామాలు, పర్యాటక ప్రాంతాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు. కురిచేడు మండలం ముష్ట గంగవరం వద్ద గుండ్లకమ్మ నదిపై చప్టా కోతకు గురైంది. కొద్ది రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మ నది నీటి ప్రవాహం పెరగడంతో రహదారి కోతకు గురైంది. దీంతో కురిచేడు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా.. ఎవరూ ఆ మార్గంలో వెళ్లకుండా పోలీసులు మరియు అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఇక నెల్లూరు జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల భారీ, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు పడుతున్నాయి. కృష్ణపట్నం పోర్టులో ఐదో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. నెల్లూరు తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. నగరంలోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఎగువ ప్రాంతాలనుంచి వస్తున్న వరదతో ఇళ్ల చుట్టూ నీరు చేరింది.

తల్పగిరికాలనీ, ఆర్టీసీ కాలనీ, చంద్రబాబునగర్, శ్రామికనగర్, మారుతినగర్, మృదులనగర్ ప్రాంతాల్లో వర్షపు నీరు ముంచెత్తింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై కాజ్వేపై నుంచి నీరు ప్రవహిస్తోంది.

మొంథా తుపాను ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బహుదానది ఉగ్రరూపం దాల్చింది. ఇచ్ఛాపురంలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. పలు ప్రాంతాల్లో వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



నెల్లూరు జిల్లా పొదలకూరు పట్టణంలోని రైస్ మిల్లు వద్ద..



గిద్దలూరు ఆర్టీసీ గ్యారేజ్ వద్ద నిలిపివున్న కారుపై విరిగిపడిన చెట్టు



వృక్షం కూలిపోవడంతో దెబ్బతిన్న కారు



విశాఖ జిల్లా కురుపాంలో నేలకూలిన చెటు



పిఠాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడిన వృక్షం



శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం
సింధువాడ గ్రామం వద్ద నేలకొరిగిన వరి పంట



# ప్రజాప్రతినిధులంతా సహాయ చర్యల్లో ఉన్నాం

**●తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటన**



ఏలూరు(చైతన్యరథం): ఏలూరు జిల్లాలోన తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పర్యటించారు. ఉదయం జోరువానలోనే కొల్లేరు బయలుదేరిన ఎంపీ, కైకలూరు సమీపంలో మాదేపల్లి గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడారు. కొల్లేరు సమీపంలో చెరువుల వద్ద ఆక్వా రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కైకలూరు నుంచి ఉప్పుటేరు బ్రిడ్జి వద్దకు చేరుకున్న ఎంపీ ఉప్పుటేరు నీటి ఉధృతిని పరిశీలించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఉండి ఎమ్మెల్యే, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుతో కలిసి ఉప్పుటేరు ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీ పుట్టా మహేష్ మీడియాతో మాట్లాడారు. తుఫాన్ పరిస్థితులపై ప్రభుత్వం, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, ఎటువంటి ప్రాణ నష్టం జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, నారా లోకేష్ నిరంతరం పరిస్థితులను సమీక్షిస్తున్నారని, ప్రజా ప్రతినిధులంతా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఆహారం, అత్యవసర వైద్యం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం అక్కడినుంచి కైకలూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాసం పొందుతున్న వ్యక్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. సాయంత్రం ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామంలో కూటమి పార్టీల కార్యకర్తలతో భేటీలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తుఫాను సహాయ చర్యల్లో పాల్గొనాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరం అయితే ఏలూరు కలెక్టరేట్ వద్ద కంట్రోల్ రూమ్ నెంబర్ 1800-233-1077, 94910 41419 ఫోన్ నెంబర్ల లేదా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయ నంబర్స్ o91 96181 94377, o91 98855 19299 కు ఎవరైనా కాల్ చేయవచ్చని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన ప్రకటనలో తెలిపారు.


# తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి గొట్టిపాటి రవి

నరసాపురం (చైతన్యరథం): నరసాపురం నియోజకవర్గంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పర్యటించారు. పునరావాస కేంద్రానికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రాణ, ఆస్తి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ విప్ నాయకర్, ఏఎంసీ చైర్మన్ శ్రీమన్నారాయణ, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దిరాజు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పర్యటించారు. నాగాయలంక, కోడూరు, చల్లపల్లి పునరావాస కేంద్రాలను ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి పరిశీలించారు.



# మొంథా తుపాన్‌పై ఎమ్మెల్యే రోషన్ కుమార్ సమీక్ష



చింతలపూడి (చైతన్యరథం): నియోజకవర్గంలో మొంథా తుపాన్ పభావంపై అధికారులతో ఎమ్మెల్యే రోషన్ కుమార్ సమీక్షించారు. రాష్ట్రంలో దూసుకొస్తున్న మొంథా తుపాన్ ప్రభావంపై చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ మంగళవారం అనంతపురం నుండి అధికారులతో గ్రూప్ కాల్‌లో సమీక్షించారు. రైతులకు, ప్రజానీకానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతపురంలో జరుగుతున్న దళిత శాసనసభ్యుల కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వెళ్లిన రోషన్ కుమార్ చింతలపూడి నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావం ఏ మేరకు ఉంది? ఇక్కడ నెలకొన్న పరిస్థితులపై అనుక్షణం ఆరా తీస్తూ, అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సహాయ, పునరావాస చర్యలలో ఏ విధమైన లోపం, జాప్యం ఉండరాదని ఆయన సూచించారు. సమీక్షలో వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు నియోజవర్గ మరియు మండల స్థాయి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# విపత్తు సమయంలో ప్రజలకు అండగా ఉండాలి : గన్ని



భీమడోలు (చైతన్యరథం): విపత్తు సమయంలో ప్రజలకు అండగా ప్రతి ఒక్కరూ నిలవాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు వ్యాఖ్యానించారు. మెంథా తుపాను పలు సూచనలు చేసిన వీరాంజనేయులు... మంగళవారం ఉదయం నుంచి గ్రామ టీడీపీ నాయకులతో చరవాణిలో మాట్లాడుతూ... అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెంథా తుపాను నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో స్థానిక శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజుతోను మండల అధికారులతోను కలిసి పరిశీలించారు. భీమడోలు జంక్షనులో ఏలూరు వైపు డ్రైనేజీని, ఆందనాలమ్మ చెరువును కాట్రగడ్డ కళ్యాణ మండపం వద్ద కలవర్ట్ పరిశీలించారు. ఈ సంధర్భంగా గన్ని మాట్లాడుతూ... మెంథా తుపాను ప్రభావం తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తగా ఉండండి. అవసరమైతే తప్ప బయటకు రావొద్దు. కొద్దిసేపటి క్రితం తీవ్ర తుపానుగా మారింది. ఈ సాయత్రం లేదా రాత్రికి తీరం దాటే అవకాశం ఉంది. ఇప్పటికే గాలులు వీస్తూ వర్షాలు కురుస్తున్నాయి. తీవ్ర తుపానుగా ఉన్న సమయంలో ఈ విపత్తు మరింత ప్రభావం చూపనుంది. తీవ్ర తుపాను ప్రభావంతో గంటకు100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వేస్తాయి. రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండండి. నియోజకవర్గంలోను మరియు ఏలూరు జిల్లాలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించాలని కూటమి కేడర్‌కు విజ్ఞప్తి. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను నమ్మొద్దు. విపత్తుల సమాచారం కొరకు ఈ కింది నెంబర్లుకు కాల్ చేయండి. నియోజకవర్గంలోని కూటమి కుటుంబ సభ్యులు అధికారులతో సమన్వయం చేసుకుని ఈ విపత్తు సమయంలో ప్రజలకు అండగా ఉండాలని గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు.

# ఏలేరు దిగువ ప్రాంతాల్లో అప్రమత్తత అవసరం

**●ఇర్రిపాకలో ఏటిగట్టుకు పటిష్ట చర్యలు : జ్యోతుల నవీన్**



జగ్గంపేట (చైతన్యరథం): ఏలేరు జలాశయానికి ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉందని, కావున దిగువ ప్రాంతాల్లో అధికారులంతా అప్రమత్తంగా జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆదేశించారు. మంగళవారం ఇరిగేషన్, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లతోజగ్గంపేట మండలం ఇర్రిపాకలోని ఏలేరు ఏటిగట్లను ప్రతిష్ట పరిచే చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నుంచి అధిక శాతం నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరు, సుద్దవాగు ప్రభావిత మండలాల్లో తాహశీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.కిర్లంపూడిమండలంలోని విఆర్ఒలు హెడ్ క్వార్టర్‌లో ఉండి ఎటువంటి సంఘటన జరిగిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడా ఏ చిన్న ఇబ్బంది జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట రిలీఫ్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నవీన్ ఆదేశించారు. బలహీనంగా ఉన్న గట్లను ముందే గుర్తించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల పరిధిలో గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, పిల్లలను ముందుగానే ఆసుపత్రులకు తరలించడం తోపాటు ముంపు గ్రామాల ప్రజలను రిలీఫ్ కేంద్రాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను నవీన్ ఆదేశించారు.ప్రమాద స్థాయిలో ఏలేరు నీటిమట్టంఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌కు వరద నీరు చేరడంతో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. అని ఏలేరు పరివాహ ప్రాంతాలని అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రమేష్, ఎస్సై రఘునాథరావు, భూ పాలపట్నం ప్రసాద్, జ్యోతుల సత్యమూర్తి, వీఆర్వో, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మొంథాను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నాం

**●10 వేలమందికి ఆహారం సిద్ధం చేశాం**

**●మంత్రి లోకేష్‌తో ఫోన్లో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంటకరాజు**

**●నియోజకవర్గంలోని పరిస్థితిని తెలుసుకునేందుకు ఆర్టీజీఎస్ నుంచి ఎమ్మెల్యేకు లోకేష్ ఫోన్**

**●ఎర్రకాలువతో రైతులు పడుతున్న ఇబ్బందిని లోకేష్‌కు వివరించిన ఎమ్మెల్యే**



నల్లజర్ల (చైతన్యరథం): మొంథా తుఫాన్ నేపథ్యంలో నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగంతో కలిసి సిద్ధంగా ఉన్నామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంటకరాజు అన్నారు. రైతులతో కలిసి ఎర్రకాలువ గట్లను పరిశీలిస్తున్న సమయంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి తుఫాన్ ప్రభావాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్యే మద్దిపాటికి ఫోన్ చేశారు. నియోజకవర్గంలో తుఫాను ప్రభావిత కారణంగా ముంపు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితిని గురించి ఆరా తీశారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలను మద్దిపాటి వివరించారు. ప్రజలకు ఇబ్బందులు ఉన్నచోట నుంచి పునరావాస కేంద్రాలకు తరలించాలని మంత్రి లోకేష్ సూచించగా... పునరావాసాలకు తరలించడంతో పాటు 10 వేల మంది ఆహారాన్ని, తాగునీటిని కూడా సిద్ధం చేసి ఉంచామని మద్దిపాటి వివరించారు. పొలాలు ముంపుబారిన పడకుండా డ్రెయిన్లు క్లియర్ చేసే అంశంపైనా దృష్టిపెట్టాలని మంత్రి లోకేష్ అన్నారు. రైతులతో కలిసి ట్రాక్టర్‌లో పంటలను పరిశీలించామని, కాల్వలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని మద్దిపాటి వివరించారు. ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వెంటకరాజుకు మంత్రి లోకేష్ సూచించారు. అంతకముందు ఎమ్మెల్యే వెంటకరాజు నల్లజర్ల మండలం గుండెపల్లి గ్రామంలో ఎర్ర కాలువ ఉధృతిని స్థానిక రైతులులతో కలిసి పరిశీలించారు. పలు గ్రామాల్లో ట్రాక్టర్‌పై తిరుగుతూ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే వెంటకరాజు అడిగి తెలుసుకున్నారు.

## పెడనలో పునరావాస కేంద్రాల పరిశీలన



పెడన (చైతన్యరథం): బంటుమిల్లి మండలం చోరంపూడి గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. మొంథా తుఫాన్ తీవ్రత మరియు ప్రభుత్వ ముందస్తు హెచ్చరిగా చోరంపూడి పంచాయతీలో నివాసం ఉంటున్న కొంతమంది నిస్సహాయ కుటుంబాలకు ఆశ్రయం కల్పించి వారికి కావలసిన కనీస అవసరాలు తీర్చుతున విషయంలో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు ప్రభుత్వం తరపున తక్షణమే స్పందించి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రంలో నిత్యవసర చర్యలలో భాగంగ తగు జాగ్రత్తలు కొరకు చోరంపూడి పంచాయతీ ప్రెసిడెంట్ రేపు గోపాలకృష్ణని, బంటుమిల్లి మండలం అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు, డీసీ చైర్మన్ బొర్రా కాశీని గ్రామంలోని నాయకులను కార్యకర్తలను మరియు కూటమి నాయకులను కార్యకర్తలను, రెవెన్యూ, పోలీస్, వైద్య, సచివాలయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## తుపాను ప్రభావం అధికం... జాగ్రత్తలు తీసుకోండి

● లోతట్టు ప్రాంత ప్రజల్ని తరలించిన ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



పామర్రు (చైతన్యరథం): మొంథా తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని, ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రజలకు సూచించారు. మంగళవారం మొవ్వ మండలం నిడుమోలు గ్రామంలో, మొంథా తుపాన్ ప్రభావం కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ప్రభుత్వ సహకారంతో సురక్షితమైన ప్రదేశాలకు తరలించారు. అలాగే ముంపు గురైన ప్రజలకు ఎటువంటి లోటు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని, అందరికి ఆహారం, మందులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోపిదేవిలో తుపాను బాధితుల పరామర్శ



మోపిదేవి (చైతన్యరథం): మోపిదేవి మండలం కోసూరువారిపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ పరిశీలించారు. మొంథా తుఫాన్ బాధితులను పరామర్శించారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న ఆహారం, త్రాగునీరు, వైద్యం ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షులు భోగిరెడ్డి సాంబశివరావు, జనసేన పార్టీ మండల కార్యదర్శి గరికపాటి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వెంకట్రామ్ చేతులమీదుగా తుఫాన్ బాధితులకు దుప్పట్లు, చిరుతిండ్లు అందచేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, బీజేపీ మండల అధ్యక్షులు సనకా ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్లు కోసూరు నాగ మల్లేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్ బాబు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్, నాయకులు కోసూరు శివాజీ, గ్రామ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలను సందర్శించిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (చైతన్యరథం): తుఫాన్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ప్రజల సౌకర్యాలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులను అవసరమైన సూచనలు చేశారు. తొలుత ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుంటూరు మిర్చి యార్డు, స్తంబాల గరువు పుల్లయ్య మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. అక్కడ తుఫాన్ కారణంగా నివాసాలు విడిచి వచ్చిన ప్రజలను పరామర్శించి, వారికి అందిస్తున్న ఆహారం, వైద్య సదుపాయాలు, శానిటేషన్ పరిస్థితులు, త్రాగునీటి వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో దాదాపు 23 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసాం. మిర్చి యార్డు, పుల్లయ్య స్కూల్, చిన్మయ స్కూల్ కేంద్రాలు పూర్తిగా నిండిపోయాయి.

## ప్రకృతి విపత్తుల నుంచి ప్రజల్ని కాపాడటంలో చంద్రబాబు తర్వాతే ఎవరైనా : ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): నియోజకవర్గంలో మొంథా తుపాను తీవ్రత దృష్ట్యా మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం సాయంత్రం పట్టణంలో క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వివిధ విభాగాల అధికారులు.. కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులు.. అనుబంధ విభాగాల సభ్యులతో కలిసి 25వ వార్డు (జాగుపాలెం), 28వ వార్డు (కొండ్రుపాడు), సుగాలి కాలనీల్లో పర్యటించారు. సుగాలి కాలనీ, చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజల్ని సమీపంలోని మున్సిపల్ పాఠశాలకు బస్సుల్లో తరలించే ఏర్పాట్లు చేసిన ప్రత్తిపాటి.. ప్రజలకు స్వయంగా ఆహారం అందించి వారికి ధైర్యం చెప్పారు.

**తమకు ఏ కష్టం రాకుండా చంద్రబాబు చూసుకుంటాడన్న ధైర్యంతో ప్రజలున్నారు...**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం.. అధికార యంత్రాంగం తుపాను పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి సర్వ సన్నద్ధంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, మంత్రులు ఎప్పటికప్పుడు తుపాను తీవ్రతను గమనిస్తూ, ఆర్టీజీఎస్ ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు, సమస్యల పరిష్కారానికి తీవ్రంగా శ్రమిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి కూడా మొంథా తీవ్రతపై సమీక్షించి, అధికారులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారన్నారు. ప్రజలకు కష్టమొస్తే చంద్రబాబు నాయుడు ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయరని, గతంలో రాష్ట్రంలో సంభవించిన ప్రకృతి విపత్తులను ఎంత సమర్థవంతంగా ఎదుర్కొన్నారో తెలిసిందేనని, వాటి బారి నుంచి రాష్ట్రాన్ని, ప్రజల్ని కాపాడటంలో ఆయన తర్వాతే ఎవరైనా అని ప్రత్తిపాటి తెలిపారు. ఏపీ ప్రజలు నేడు మొంథా సంగతి చంద్రబాబు చూసుకుంటాడని ధీమాగా ఉన్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

## విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం : యార్లగడ్డ

● పుకార్లు నమ్మవద్దు తుఫాను బాధితులందరికీ పరిహారం ఇస్తాం

● తుఫాన్ బాధితుల ఆకలి తీర్చేందుకు అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తా



గన్నవరం (చైతన్యరథం): కోస్తాజిల్లాలను వణికిస్తున్న మొంతా తుఫాను తీవ్రత కారణంగా ఎటువంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు గన్నవరం నియోజకవర్గంలో ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని తుఫాను పునరావాస శిబిరాలను మంగళవారం మధ్యాహ్నం యార్లగడ్డ సందర్శించారు. ముందుగా చెంచుల కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని అనంతరం కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస శిబిరంలోని వసతులను పరిశీలించిన ఆయన బాధితులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ... గన్నవరం మండలంలోని కేసరపల్లి గ్రామం తోపాటు చిన్నపల్లి వారి గూడెం, కట్టుబడి పాలెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి 450 మందిని శిబిరాలకు తరలించినట్లు తెలిపారు. శిబిరాలలో తలదాచుకున్న బాధితులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదృష్టవశాత్తు ఇతర జిల్లాలతో పోల్చుకుంటే కృష్ణా జిల్లాలో తుఫాను ప్రభావం తక్కువగా ఉందని, గన్నవరం నియోజకవర్గంలో వర్షపాతం తక్కువగా నమోదు అయిందన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని అధికారులు అందరూ తుఫాన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస శిబిరాలకు తరలించేందుకు కృషి చేస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. వాతావరణ శాఖ అధికారుల అంచనాల మేరకు భారీ వర్షాలు కురిస్తే పునరావాస శిబిరాలను మరిన్ని పెంచాల్సి ఉంటుందని, ఇందుకోసం అవసరమైతే గతంలో బుడమేరు వరదల మాదిరిగా తన సొంత నిధులు వెచ్చించి కళ్యాణ మండపాలను అద్దెకి తీసుకొని బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుఫాన్ బాధితులకు సాయంపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని పుకార్లు నమ్మవద్దని హితవు పలికారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తుఫాన్ సహాయ చర్యల్లో పాల్గొని ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో తుఫాన్ బాధితులకు అండగా ఉండాలని యార్లగడ్డ పిలుపునిచ్చారు. జోరు వానలో తడుస్తూనే యార్లగడ్డ సహాయ శిబిరాలను సందర్శన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చిరుమామిళ్ల సూర్యం, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు మేమున్నాం... తూర్పు ఎమ్మెల్యే నసీర్ మహమ్మద్ భరోసా

● జోరువానలో ప్రజలకు తోడుగా ఉదయం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటన



గుంటూరు (చైతన్యరథం): జోరువానలోనూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మంగళవారం ఉదయాన్నే వార్డుల పర్యటనకు వెళ్లారు. మొథాన్ తుపాను నేపథ్యంలో భయపడాల్సిన పని లేదని, 24/7 మీ వెంటనే ఉంటామని ప్రజలకు అభయం కలిగించారు. బొంగరాల బీడు, గడ్డిపాడు, బసవతారక రామ నగర్, మద్దిరాల కాలనీ, నెహ్రూ నగర్, రామిరెడ్డి తోట, వినోభా నగర్, ఇస్రాయెల్ పేట, జున్నుసైదా నగర్ ప్రాంతాలకు వెళ్లి స్థానిక ప్రజలతో మాట్లాడారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అత్యవసరమైతే బయటికి రావాలని సూచించారు. కాలువలను పరిశీలించి ఎప్పటికప్పుడు షిల్ట లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వరద ప్రభావిత ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. చిన్న పిల్లలను బయటికి పంపించవద్దని సూచించారు. ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని చెప్పారు. మంచినీరు కాచి తాగాలని, చెట్ల కింద ఉండకూడదని సూచించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ భోజన వసతి వంటి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. విద్యుత్ వ్యవస్థపై అప్రమత్తంగా ఉండాలని, స్తంభాలు, వైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# మంత్రి నారాయణ వ్యూహాత్మక ఆలోచనలతో తుఫాన్ విపత్కర పరిస్థితులకు చెక్

## • క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను ముమ్మరం చేసిన టీడీపీ శ్రేణులు



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వ్యూహాత్మక ఆలోచనలు సత్ఫలితాలను ఇచ్చాయి. విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు ఎదుర్కోవాల్సిన చర్యలను ముందస్తుగా చేపట్టడంతో ప్రస్తుతం నెల్లూరు ప్రజలంతా ఎలాంటి టెన్షన్ లేకుండా ఉన్నామంటున్నారు. మంత్రి నారాయణ ముందుచూపు మేరకు తూఫా హెచ్చరికలకు ముందే అధికారులను ఆదేశించి ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తీయించడం వల్ల ప్రస్తుతం కురుస్తున్న మొంథా తుఫాన్‌తో వచ్చే నీరు నిల్వ లేకుండా సులువుగా దిగువకు వెళ్ళిపోతుంది. దీంతో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదంటూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి నారాయణ ఎప్పటికప్పుడు నెల్లూరులో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గంట గంటకు అధికారులు, టిడిపి శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ చేపట్టాల్సిన చర్యలపై దిశ నిర్దేశం చేస్తున్నారు. దీంతో నెల్లూరు సిటీ పరిధిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి కమిషనర్ నందన్ దగ్గరుండి వసతులను కల్పిస్తున్నారు. నెల్లూరు నగర ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బంది పడకూడదన్న మంత్రి నారాయణ ఆదేశాల మేరకు అధికారులు, టిడిపి శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించి తుఫాన్ విపత్కర పరిస్థితిలను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం చేస్తూ ప్రజలకు భరోసాగా నిలుస్తున్నారు. 24 గంటలు పాటు నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు అందుతున్నాయి. నెల్లూరు సిటీ పరిధిలో చేపడుతున్న సహాయక చర్యలు, అధికారులు చేపట్టాల్సిన పనులు, క్షేత్రస్థాయిలో టిడిపి శ్రేణులు చేస్తున్న సేవలు, ఇతర అంశాలపై మంత్రి నారాయణ ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేస్తూ టెలి కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు అందజేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో బస చేస్తున్న వారికి మూడు పూట్ల ఆహారం ఏర్పాటు చేయాలని, వసతులు కల్పించాలని మంత్రి ఆదేశించారు. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధమైన అధికారులను, టిడిపి శ్రేణులను అభినందిస్తూ, మరోవైపు ప్రజలకు తానున్నానంటూ ధైర్యం ఇస్తూ మంత్రి నారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. మంత్రి ఆదేశాల మేరకు టిడిపి శ్రేణులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయక చర్యలు చేపడుతున్నారు.డివిజన్లలో పలుచోట్ల పడిపోయిన పెద్ద పెద్ద చెట్లను తొలగించడంతోపాటు, అక్కడక్కడ గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను సరి చేయిస్తున్నారు. ఆయా డివిజన్లోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు భోజనం ప్యాకెట్లను అందించడం ఇతర సహాయక చర్యలు చేపట్టడం వారికి ధైర్యం చెప్పడం వంటి కార్యక్రమాలను మంత్రి ఆదేశాల మేరకు టీడీపీ నేతలు చేస్తున్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది వచ్చినా అధికారులకు తెలియజేయాలంటూ ప్రజలకు మంత్రి సూచిస్తున్నారు.

# తిరుమలలో సన్నిధి గొల్ల శరభయ్య యాదవ్ విగ్రహం ఏర్పాటుకు వినతి

తిరుమల (చైతన్యరథం): తిరుమలలో సన్నిధి గొల్ల శరభయ్య యాదవ్ విగ్రహం మరియు శరభయ్య యాదవ్ మఠం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్, వాసుదేవ యాదవ్ సేవా సంఘం తరపున తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు టీటీడీ పాలకమండలి చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈ.ఓ, అదనపు ఈ.ఓ మరియు సభ్యులతో సమావేశమై తమ అభ్యర్థనను వివరించారు. మీడియాతో మాట్లాడుతూ, పురాణ చరిత్ర ప్రకారం మహావిష్ణువు భూలోకానికి అవతరించినప్పుడు మొట్టమొదట ఆయనను యాదవ వంశానికి చెందిన గొల్ల శరభయ్య యాదవుడు దర్శించిన విషయం గుర్తుచేశారు. అదే సందర్భాన్ని స్మరించుకునే సంప్రదాయమే "గొల్ల సన్నిధి" అని వివరించారు. వెంకటేశ్వర స్వామి ప్రతీ రోజూ ఉదయాన్నే యాదవుల ముఖాన్ని తొలిసారిగా దర్శించాలనే సంప్రదాయం అప్పటి నుంచే ప్రారంభమైందని తెలిపారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన శరభయ్య యాదవ్ విగ్రహం ఇప్పటికీ తిరుమలలో ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని, యాదవ సమాజం ఆవేదన వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. తిరుమలలో శరభయ్య యాదవ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆయన పేరిట మఠం నిర్మించాలని టీటీడీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే టీటీడీ ట్రస్ట్ బోర్డులో యాదవ సమాజానికి శాశ్వత చైర్మన్ పదవులు కేటాయించాలనీ, 50 శాతం సభ్యత్వాన్ని యాదవులకు ఇవ్వాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా నిర్మితమవుతున్న అన్ని వెంకటేశ్వర ఆలయాల్లో "గొల్ల సన్నిధి" సంప్రదాయాన్ని కొనసాగించాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు.



# మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## •పలుచోట్ల వరద బాధితులకు దుప్పట్లు, ఆహార పదార్ధాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరి (చైతన్యరథం): మొంథా తుపాను ప్రభావంతో ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు తీవ్రమైన వర్షాలు, బలమైన ఈదురు గాలులు, తీవ్ర చలిగాలుల పరిస్థితుల్లో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ స్వయంగా వరద బాధిత ప్రాంతాలలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. మంగళవారం ఉదయగిరి మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి, అక్కడ తాత్కాలికంగా ఆశ్రయం పొందిన బాధిత కుటుంబాలతో మాట్లాడారు. వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. చలి కారణంగా ఇబ్బంది పడుతున్న 50 కుటుంబాలకు పైగా తక్షణ సాయంగా ఆయన స్వయంగా దుప్పట్లు, పండ్లు, తినుబండారాలు, తాగునీటి బాటిళ్లు పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే తన ప్రాధాన్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని రకాల సాయం అందించేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, తక్షణ స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆయన స్థానిక అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది చలిని దృష్టిలో ఉంచుకుని పునరావాస కేంద్రాలలో తగిన వసతి, వైద్య సదుపాయాలు, నీరు, ఆహార పదార్థాలు నిరంతరం అందించాలంటూ సూచించారు.

# అప్రమత్తంగా ఉన్నాం... అండగా ఉంటాం

## •మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): మొంథా తుఫాన్ నేపథ్యంలో మంగళవారం ఉదయం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్‌లో జరుగుతున్న కాలువ పూడికతీత పనులను స్థానిక కార్పొరేటర్, నాయకులు మరియు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలసి నియోజకవర్గ టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరిశీలించారు. రూరల్ నియోజకవర్గంలో మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉందని, అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా, ఎప్పుడూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం అందుబాటులో ఉంటుందని, భారీ వర్షాల కారణంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో అన్ని ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నామని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్పా ఎవరూ బయటకు రావొద్దని, విపత్తు వేళ ప్రజలకు సహాయం అందించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌ఛార్జ్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్‌బాబు, టీడీపీ నాయకులు దిలీప్‌రెడ్డి, మాస శ్రీనివాసులు, కాకుపల్లి శివకుమార్, పొట్టేళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇనమడుగు పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రశాంతి

## ●నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే
## ●ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచన



కోవూరు (చైతన్యరథం): మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వరద బాధిత పునరాస కేంద్రాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. బాధితుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న 42 కుటుంబాలకు చెందిన 91 మందికి ఆమె భోజనం, పండ్లు, టూత్ పేస్టు, సబ్బులతో కూడిన కిట్లు మరియు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మొంథా తుఫాను విపత్తును ఎదుర్కొనేందుకు అధికారులు మరియు నాయకులు సమిష్టిగా కృషి చేస్తున్నారని చెప్పారు. అధికారులకు తోడుగా ఉంటూ ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో అండగా నిలుస్తున్న నాయకులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అభినందించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెన్నా పరివాహక ప్రాంత గ్రామాలలోని కరకట్టలకు నిధులు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే చాలా చోట్ల మొదలయ్యాయన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురి కావద్దని, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీహరి, ఇరిగేషన్ ఏఈ పెంచలయ్య, డెల్టా చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, టిడిపి కోవూరు మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఇంత మల్లారెడ్డి ఎంపీటీసీ సునీల్ రెడ్డి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లా వాగులో కొట్టుకుపోయిన కారు



ఒంగోలు: పశ్చిమమధ్య బంగాళాఖాతంలో మొంథా తీవ్ర తుపాను ప్రభావంతో ప్రకాశం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం యరజర్ల-వెంగముక్కలపాలెం మధ్య వాగులో కారు కొట్టుకుపోయింది. కారు నుంచి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఒంగోలుకు చెందిన వినోద్ కుమార్ అనే వ్యక్తి యరజర్ల వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో కారును పక్కకు తిప్పగా.. మార్జిన్లోంచి కారు దిగువకు జారింది. వాగు ప్రవాహానికి కొట్టుకుపోయింది. ప్రమాదాన్ని గమనించిన వినోద్కుమార్ వెంటనే కారు నుంచి దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు.

# మహిళల్ని... వ్యాపారవేత్తల్ని చేసిన ఘనత సీఎం చంద్రబాబుదే

**•స్వయం సంఘాలకు రుణాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**




అనంతపురం (చైతన్యరథం): మహిళల్ని వ్యాపారవేత్తల్ని చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు రుణాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. నూతన అర్బన్ టీడీపీ కార్యాలయంలో స్వయం సంఘాలకు రుణాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన... 322 సంఘాలు, 1691 మంది సభ్యులకు రూ.20.30కోట్లు పంపిణీ చేశారు. బ్యాంక్ లింకేజీ, సీఐఎఫ్, ఉన్నతి ద్వారా సభ్యులకు రుణాలు కార్యక్రమంలోడీ.ఆర్.డి.ఏ, సెర్ప్ అధికారులు ఉన్నారు. ఇకపై స్వయం సహాయక సంఘాల సభ్యుల్ని ఎవరూ మోసం చేయలేరని, చెల్లించిన డబ్బు వివరాలు.. సెల్ ఫోన్ ద్వారానే తెలుసుకోవచ్చునని అన్నారు. ఈ యాప్ ద్వారా చదువు రాని వారు కూడా సులభంగా తెలుసుకోవచ్చు. ఇది సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల ఘనత. గతంలో కొందరు మోసాలకు పాల్పడే వారు.. ఇప్పుడు అలాంటి అవకాశం ఉండదు. అత్యంత పారదర్శకంగా వ్యవస్థను మార్చామని, మహిళలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంతో గౌరవమన్నారు. డ్వాక్రా వ్యవస్థను తీసుకొచ్చేందే సీఎం చంద్రబాబునాయుడేనని, దీని ద్వారా మహిళలకు ఇంట్లో గౌరవం పెరిగిందన్నారు. పారిశ్రామకవేత్తల రుణాలు 30శాతం పెండింగ్‌లో ఉన్నాయని, కానీ మహిళ సంఘాలు మాత్రం 99శాతం బ్యాంకులకు చెల్లించారు. గతంలో 5లక్షల వరకు మాత్రమే రుణాలు వచ్చేవి... ఇప్పుడు 8లక్షల వరకు రుణాలు తీసుకునే అవకాశం కల్పించారు. విద్యాలక్ష్మీ పథకం ద్వారా మీ పిల్లల చదువులకు 4శాతం వడ్డీతోనే రుణాలు ఇస్తారు. కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా మీ పిల్లల వివాహాలకు 4శాతం వడ్డీతోనే రుణాలు ఇస్తారు. ఎస్సీ,ఎస్టీ మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారు. ఈ రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

# మహిళల్ని... వ్యాపారవేత్తల్ని చేసిన ఘనత



పుట్టపర్తి (చైతన్యరథం): ఓడిచెరువు మండల కేంద్రంలో మామిళ్లకుంట్లపల్లి పంచాయతీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములతో పాటు గతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్ని మరియు పలు ప్రభుత్వ స్థలాలను మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పరిశీలించారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడే ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, అర్హులైన పేదలందరికీ ఇంటిస్థలాలు, ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా వారు అధికారులను ఆదేశించారు. మండలంలో వడ్డెర కమ్యూనిటీ భవనం నిర్మాణానికి అలాగే ఎన్టీఆర్ విగ్రహంతో పాటు వడ్డే ఓబన్న, శ్రీకృష్ణదేవరాయలు, యోగి వేమన తదితర విగ్రహాల ఏర్పాటుకు స్థలాలను స్థానిక అధికారులు, నాయకులతో కలిశారు.

# కోడుమూరు వైన్స్ షాప్‌లో అకస్మిక తనిఖీ

కోడుమూరు (చైతన్యరథం): వైసీపీ హయాంలో మద్యం సరఫరా, భారీ అవకతవకలు జరిగాయని, ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి వేల కోట్ల నష్టం కలిగించాయని నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కర్నూల్ మండలంలోని ఓ వైన్స్ షాప్‌లో అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాప్‌లో మద్యం విక్రయాల విధానాన్ని, బిల్లింగ్ ప్రక్రియను, క్యూలో నిలుస్తున్న వినియోగదారుల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. అవసరమైన చోట సూచనలు ఇచ్చి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా మద్యం సరఫరా చేయాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కూటమి ప్రభుత్వం నాణ్యతమైన మద్యం అందిస్తుందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి హయాంలో మద్యం సరఫరా, భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి వేల కోట్ల నష్టం కలిగించారని అన్నారు. ప్రతిపక్ష నేతలుగా అప్పట్లో పలుమార్లు ప్రశ్నించినప్పటికీ సమాధానాలు ఇవ్వకుండా దాచిపెట్టారని విమర్శించారు. వినియోగదారులు అందరూ తప్పనిసరిగా క్యూఆర్ కోడ్‌ను యూస్ చేసి, నకిలీ మద్యాన్ని అరికట్టాలని వినియోగదారులు అందరికీ సూచనలు చేశారు. రాష్ట్రంలో మద్యం ధరలు పెంచి ప్రజలపై భారం మోపడం, క్వాలిటీ లేని మద్యం సరఫరా చేయడం, సీల్డ్ బాటిళ్లలో కల్తీ జరిగిన కేసులు వరకు నమోదు అయిన విషయాన్ని గుర్తు చేశారు.

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్



నంద్యాల (చైతన్యరథం): మొంథా తుఫాను ముంచుకొస్తున్న నేపథ్యంలో, నంద్యాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజల భద్రత, రక్షణ విషయంలో ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ నంద్యాల లోతట్టు ప్రాంతాలు హరిజనవాడ, కుందునది (రాణి మహారాణి దగ్గర), సలీంనగర్ చామకాలువ, శ్యామనగర్, ఎస్బిఐ కాలనీ (రామకృష్ణ పిజి కాలేజ్ దగ్గర), విశ్వనగర్ ప్రాంతాలను అధికారులతో కలిసి స్వయంగా వెళ్లి పరిశీలించారు. నంద్యాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తగిన ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

**అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు:**

ఈ విపత్కర సమయంలో ప్రజలను సురక్షితంగా ఉంచడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ బృందాలు అత్యంత సమన్వయంతో, అంకితభావంతో పనిచేయాలని కోరారు. "ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడటమే మన తక్షణ కర్తవ్యం అని, అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉండి, ఎటువంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలలో ముందస్తు జాగ్రత్త చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు.

# ఎస్సీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్సీ వెల్ఫేర్ అసెంబ్లీ కమిటీ

**•ఏ సమస్య ఉన్నా అధికారులు తక్షణమే పరిష్కరించాలి**

**•అధికారులకు ఏపీ లెజిస్లేచర్ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వర్ల ఆదేశం**

**•అనంతపురం జిల్లాలో ఎస్సీ వెల్ఫేర్ కమిటీ పర్యటన, అధికారులతో భేటీ**



అనంతపురం (చైతన్యరథం): రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజలు ఎవరూ సమస్యల్లో మగ్గిపోకూడదని, వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేసేందుకు ఏపీ లెజిస్లేచర్ ఎస్సీ వెల్ఫేర్ కమిటీని ఏర్పాటు చేశారని ఆ కమిటీ చైర్మన్, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అన్నారు. అనంతపురంజిల్లాలో ఏపీ లెజిస్లేచర్ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా అనంతపురంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఎస్సీ సామాజికవర్గం సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) నిర్వహించారు. కమిటీ చైర్మన్ వర్ల కుమార్ రాజా పలువురు ఎస్సీ ప్రజల వద్ద నుండి వినతులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, ఆ సమస్యలను పరిష్కరించాల్సిన సదరు అధికారులకు సమస్యలను వివరించారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొని ప్రజల వద్ద వినతులు స్వీకరించారు. దళితులు ఎదుర్కొనే ప్రతి సమస్యను పరిష్కరించడమే ఈ కమిటీ పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. గ్రీవెన్స్ అనంతరం అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏపీ లెజిస్లేచర్ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ మరియు సభ్యులు పాల్గొన్నారు. జిల్లా అధికార యంత్రాంగంతో జిల్లాలో ఎస్సీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. షెడ్యూల్డ్ కులాల ప్రజల సంరక్షణ కోసం పోలీసు యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై ఎస్పీని ఆరా తీశారు. జిల్లా ఎస్పీ ఎస్సీల సమస్యల పరిష్కారం, వారి సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలపై కమిటీకి వివరాలు అందించారు. వివిధ శాఖల అధికారులు తమ దృష్టికి వచ్చిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను కమిటీకి అందజేశారు. ఎస్సీల అభ్యున్నతి కోసం ఎం.ఎస్.ఎం.ఈ లకు అందించాల్సిన ప్రోత్సాహకాలు, దానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా కమిటీ చైర్మన్ మరియు సభ్యులు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్సీలకు సొంత ఇళ్ల స్థలాలు, సొంత ఇళ్లు ఉన్నాయా, లేదా? అనే అంశాలపై అధికారులు సచివాలయాల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, ప్రజల వద్ద నుండి తమ తమ అవసరాలను అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. సొంతిల్లు, సొంతింటి స్థలం లేని వారి వివరాలు తీసుకోవాలని, తదనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన నివేదికను అందించాలని అధికారులకు సూచించారు. బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చే అంశం, ఆర్డీటీ ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్, ఎస్కే యూనివర్శిటీలో బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, ఎస్సీ సంక్షేమ హాస్టల్ సమస్యలు, ఎస్సీ కాలనీల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పాఠశాల భవనాల ఏర్పాటు, విదేశీవిద్య పథకం అమలు వంటి అంశాలపై అధికారులకు కమిటీ పలు సూచనలు చేసింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి సంబంధించిన కేసులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు పనిచేయాలని, చట్టానికి సంబంధించి మండలాలు, జిల్లాల స్థాయిలో నిర్వహించాల్సిన సమావేశాలు సక్రమంగా నిర్వహించాలని కమిటీ అధికారులను ఆదేశించింది. కార్యక్రమంలో జిల్లా అధికార యంత్రాంగం పాల్గొంది.

# వేలావడి గిరిజనులకు పునరావాసం కల్పించాం

**•కుశస్థలి నదిపై కొత్త బ్రిడ్జి నిర్మిస్తాం... శాశ్వతంగా ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం**

**•ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ హామీ**



నగిరి (చైతన్యరథం): మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న వేలావడి గిరిజన కాలనీ, పుత్తూరు, నింద్ర, వడమాలపేటలోని పలు ప్రాంతాల్లో ఇళ్ళు పడిపోయాయని, ఆయా ప్రాంతాల్లో వున్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆయన నగరి వేలావడి ఎస్టీ కాలనీలో మీడియాతో మాట్లాడుతూ... పునరావాస కేంద్రాల్లో వున్న ప్రజలకు భోజనం, ఇతర సదుపాయాలు కల్పించామన్నారు. ఇళ్ళు పడిపోయిన వారికి పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ఇంటి స్థలం ఉండి ఇళ్ళ లేని వారి కూడా పక్కా ఇళ్ళు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే కుశస్థలి నదిపై వరద ఉధృతి కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కృష్ణాపురం బేరేజ్ నిండినపుడు గేట్లు ఎత్తినప్పుడల్లా గొలుసు చెరువులు నిండి వరదలు పెరుగుతున్నాయన్నారు. ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురౌతున్నాయన్నారు. బ్రిడ్జి నిర్మాణ మంజూరుకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది, 26 కోట్ల రూపాయల ప్రతిపాదనల తో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ఆర్ అండ్ బి ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణబాబుతో చర్చించి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్.. విద్యుత్ శాఖ మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఎయిరిండియా బస్సు దగ్ధం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా బస్సు దగ్ధమైంది. విమానాశ్రయం మూడో టెర్మినల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ సిబ్బంది, అగ్నిమాక సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేశారు. ట్యాక్సీయింగ్ ఏరియాలో నిలిపి ఉంచిన విమానానికి అత్యంత సమీపంలో ఈ ఘటన జరిగినప్పటికీ ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రౌండ్ హ్యాండిలర్స్‌కు చెందిన బస్సు మధ్యాహ్నం సమయంలో మంటల్లో చిక్కుకుందని, అయితే ఏఆర్‌ఎఫ్‌ఎఫ్ నిపుణుల బృందం రెండు నిమిషాల్లోనే మంటలను అదుపు చేసిందని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారిక‘ఎక్స్’ ఖాతాలో తెలియజేసింది. ఘటన సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ నష్టం జరగలేదని తెలిపింది. విమాన సర్వీసులు యథా ప్రకారం నడుస్తున్నాయని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంది.

## ప్రశాంత్ కిషోర్‌కు ఎన్నికల సంఘం నోటీసులు

న్యూఢిల్లీ: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్‌కు ఎన్నికల కమిషన్ మంగళవారం షోకాజ్ నోటీసు ఇచ్చింది. బిహార్‌తో పాటు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలోనూ ఆయన పేరు కనిపించడంతో ఈసీ ఈ చర్యలకు దిగింది. బీహార్‌లో రోహటాస్ జిల్లా ససరాంలోని కర్గాహార్ అసెంబ్లీ నియోజవవర్గం రిటర్నింగ్ అధికారి ఈ నోటీసులు పంపారు. కర్గాహార్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 621లో ఎపిక్ (ఓటర్ ఐడి) నంబర్ 1013123718 కింద ఓటరుగా ఆయన పేరు నమోదైందని, ఇదే సమయంలో పశ్చిమబెంగాల్‌లోని భాబనిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సెయింట్ హెలెన్ స్కూలు పోలింగ్ బూత్‌లో కూడా ఆయన పేరు నమోదై ఉందని ఆ నోటీసులో రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950 లోని సెక్షన్ 17 కింద ఒక వ్యక్తి ఒకటికి మించిన నియోజకవర్గాల్లో పేరు నమోదు చేసుకోరాదు. అలా చేసినట్లయితే సెక్షన్ 31 కింద ఏడాది జైలు లేదా జరిమానా.. ఒక్కోసారి రెండూ విధించే అవకాశం ఉంది. రెండు వేర్వేరు రాష్ట్ర ఓటర్ల జాబితాల్లో పేర్ల నమోదుపై మూడురోజుల్లోగా వివరణ ఇవ్వాలని ప్రశాంత్ కిషోర్‌ను ఎన్నికల కమిషన్ కోరింది. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నందున ఈసీ నోటీసులపై ప్రశాంత్ కిషోర్ వెంటనే స్పందించలేదు.

# మొంథా తుపానుపై రైల్వేమంత్రి ఆదేశాలు

**- వార్‌రూమ్ ఏర్పాటుకు సూచనలు**



న్యూఢిల్లీ: మొంథా తుపాన్ అలజడి ప్రభావ ప్రాంతాల్లోని ప్రతి రైల్వే విభాగంలో అత్యవసర నియంత్రణ కేంద్రాలు (వార్ రూమ్స్) తక్షణమే ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు. రైల్వే వ్యవస్థలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని.. అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆయన స్పష్టం చేశారు. ఈ తుపాన్ తూర్పు తీరంపై ప్రభావం చూపనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం న్యూఢిల్లీలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తుపాను వాస్తవ పరిస్థితులను అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. అయితే ఈ తుపాన్ ప్రభావం ఏపీ, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో ఉంటుందని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజనుల్లో అవసరమైన సామగ్రి, యంత్ర పరికరాలను ముందుగానే సిద్ధం చేసుకోనేలా సిబ్బందిని ఆదేశించాలని సూచించారు. ఈ తుపాన్ ప్రభావం కారణంగా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా రైళ్ల రాకపోకలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, సౌత్ సెంట్రల్ కోస్ట్ రైల్వే, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్లలో అత్యవసర పరిస్థితులపై వెంటనే స్పందించేందుకు తగిన వనరులు, సిబ్బందితో పాటు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల ప్రాణ రక్షణ, ప్రయాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి విభాగం సమన్వయంతో ముందుగానే సిద్ధమై ఉంటే.. ఈ తుపాన్ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని అభిప్రాయపడ్డారు. రైల్వే వ్యవస్థలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# కేంద్ర ఉద్యోగులకు గుడ్ న్యూస్

**- 8వ వేతన కమిషన్‌కు ఆమోదం**



ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. కోటీ పదిహేను లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారుల.. జీతాలు, పింఛన్లు పెంచేందుకు వీలుగా 8వ వేతన కమిషను కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజన దేశాయ్ ఈ పే కమిషన్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. ప్రస్తుత 7వ వేతన సవరణ సంఘం కాలపరిమితి 2026తో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ తర్వాత కొత్త వేతన సవరణ అమలు చేయడానికి వీలుగా 8వ పే కమిషన్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై పలువురు కేంద్ర మంత్రు లు, మంత్రిత్వ విభాగాల సిబ్బందితో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపింది. అనంతరం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ చైర్పర్సన్, ఇద్దరు సభ్యులు ఉండనున్నారు. ఈ సంఘం 18 నెలల్లో సిఫార్సులు ఇవ్వనుందని కేంద్రం ఓ ప్రకటనలో వెల్లడించింది.

**వేతన సంఘం అంటే..**

దేశంలో సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పింఛనుదారుల వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో వేతన సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తు తమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా వేతన సవరణ చేపడుతుంది.

# కర్నాటకలో పులుల కట్టడికి రంగంలోకి గజరాజు



బెంగళూరు: మైసూరు, చామరాజనగర జిల్లాల్లో పులుల దాడుల్లో ఆదివారం ఒకే రోజున ఇద్దరు రైతులు మృతిచెందిన ఘటనలతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటీవలి కొంతకాలంగా రెండు జిల్లాల పరిధిలో పలు గ్రామాల్లో పులుల దాడితో పశువులు, గొర్రెలను రైతులు కోల్పోయారు. ఇద్దరు రైతులను ఒకేరోజున పులులు దాడి చేసి చంపేయడంతో వివిధ గ్రామాల ప్రజలు ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టారు. సోమవారం కూడా మృతదేహాలను రోడ్లపై ఉంచి ఆందోళన కొనసాగించారు.

స్థానిక అటవీ అధికారులు గ్రామస్తులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గ్రామస్థుల డిమాండ్‌తో నరభక్షక పులిని బంధించాలని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె సూచించారు. ఇందుకు అనుగుణంగా పులి పట్టివేతకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించారు. సరగూరు తాలూకా ముళ్ళూరు గ్రామంలో పులి దాడిలో రైతు రాజశేఖర్ మృతి చెందగా చామరాజనగర్ జిల్లా బండిపుర అభయారణ్య పరిధిలో రైతు శివణ్ణను పులి దాడి చేసి చంపేసింది. పులిని బంధించేందుకు కుంకీ ఏనుగులు భీమ, మహేంద్ర ఏనుగులను రంగంలోకి దించినట్టు అధికారులు తెలిపారు. పులులను కట్టడి చేయాలని రాష్ట్రవ్యాప్తంగా పలువురు కోరుతున్నారు.

# మహిళా డాక్టర్ ఆత్మహత్య కేసులో వెలుగులోకి కొత్త విషయాలు

**- సూసైడ్‌కు ముందు చాటింగ్**



మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న మహిళా డాక్టర్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యురాలి ఆత్మహత్య కేసును కొలిక్కి తీసుకొచ్చేందుకు పోలీసులకు కీలకమైన ఆధారాలు లభించాయి. ఎస్సై గోపాల్ బదానే తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ అరచేతిపై సూసైడ్ నోట్ రాసి ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు మరికొన్ని ఆధారాలు దొరికాయి. డాక్టర్ ఆత్మహత్యకు కారణమని భావిస్తున్న ప్రశాంత్ బంకర్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో ఆమె ఎప్పటికప్పుడు మెసేజ్‌లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. డాక్టర్ సూసైడ్ చేసుకోవడానికి ముందు మానసికంగా చాలా కుంగిపోయి చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఇటీవల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ ఇంట్లో మహిళా డాక్టర్ పూజకు హాజరయ్యిందని.. కానీ అక్కడ గొడవ జరిగిన తర్వాత ఆమె అక్కడినుంచి వెళ్లి హెూటల్‌లో చేరి, తీవ్ర మనోవేదనతో ఉరి వేసుకుని చనిపోయిందని తెలిపారు. సతారా పోలీసు విభాగానికి చెందిన ఎస్సై గోపాల్ బదానే పలుమార్లు తనపై లైంగిక దాడి చేశాడని ఇప్పటికే ఆమె సూసైడ్ నోట్ లో తెలిపింది. మరో వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ మానసికంగా వేధింపులకు గురిచేశాడని ఆమె ఆరోపించింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు వీరిద్దరినీ అరెస్ట్ చేయగా.. కేసు విచారణ కొనసాగుతుంది. మహారాష్ట్ర మహిళా సంఘం చైర్‌పర్సన్ రూపాలి చకాంకర్ మాట్లాడుతూ.. బంకర్ ఇంట్లో వైద్యురాలు లక్ష్మీ పూజకు హాజరై, అక్కడ ఫోటోలు తీసుకునే విషయంలో గొడవలు జరిగాయని తెలిపారు. తర్వాత డాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయిందని.. బంకర్ తండ్రి ఆమెను తిరిగి తీసుకురాగానే, ఆమె మరోసారి హెూటల్‌కు వెళ్లిపోయిందని చెప్పారు. ఇదే విషయాన్ని పోలీసు అధికారి తుషార్ దోషి కూడా ధృవీకరించారు.

# ఆగని పాక్ కుప్పిగంతులు

## పనికిమాలిన ఆఫర్‌పై బంగ్లాతో ఒప్పందం




బంగ్లాదేశ్‌లో తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచీ భారత్ వ్యతిరేక వైఖరి అవలంబిస్తూ.. పాక్‌కు దగ్గరవుతున్నారు. ఈక్రమంలో తమ కరాచీ పోర్టును వాడుకోమని బంగ్లాకు దాయాది ఆఫర్ ఇచ్చింది. దానిద్వారా జనపనార ఉత్పత్తులు, ఇతర వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసుకోమని ప్రతిపాదించింది. భూమార్గంలో ఆ దేశంనుంచి దిగుమతి అవుతోన్న కొన్ని జనపనార వస్తువులకు భారత్ తలుపులు మూసేసిన నేపథ్యంలో పాక్ ఆ ఆఫర్ ఇవ్వడం గమనార్హం.

బంగ్లా రాజధాని ఢాకాలో జరిగిన జాయింట్ ఎకనామిక్ కమిషన్ సమావేశంలో రెండుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాల పునరుద్ధరణకు నాందిపడినట్లయింది. చైనా, గల్ఫ్, మధ్య ఆసియా దేశాలతో వ్యాపారానికి ఇది కీలక ఓడరేవు కావడం గమనార్హం. అయితే ఈ సముద్రమార్గం ఆర్థికంగా లాభదాయకంకాదని పలువురు నిపుణులు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇదిలా ఉంటే, ఐదు దశాబ్దాల తర్వాత పాక్‌కు చెందిన సరకు రవాణా నౌక గత ఏడాది బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ పోర్టుకు వచ్చింది. అందుకోసం రెండువారాలపాటు 2,600 నాటికల్ మైళ్లు ప్రయాణించాల్సి వచ్చింది. ఇక అప్పటినుంచి కరాచీ–చిట్టగాంగ్ పోర్ట మధ్య పెద్దగా రాకపోకలు కనిపించలేదు. ఇక్కడ భారత్‌పై పాక్ మేకపోతు గాంభీర్యమే కనిపిస్తోంది కానీ.. పెద్దగా ప్రయోజనం చేకూర్చే చర్య కాదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఇదిలాఉంటే, ఆర్థికంగా ఇప్పటికే చతికిలపడిన పాకిస్థాన్.. బంగ్లా జనపనార ఎగుమతులను ప్రోత్సహించేందుకు సుంకాలు తగ్గించాలని నిర్ణయించిందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇప్పటికే రెండుశాతం కస్టమ్ డ్యూటీని తగ్గించింది. అదే సమయంలో భారత్‌నుంచి బంగ్లాకు మామిడి దిగుమతులు తగ్గడంతో ఆ అంతరాన్ని పూడ్చేందుకు తమ మామిడిని దిగుమతి చేసుకోవాలని పాక్ అభ్యర్థిస్తోంది. బంగ్లాదేశ్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద జనపనార ఉత్పత్తిదారుగా ఉంది. భూమార్గంలో కొన్ని ఎంపిక చేసిన జనపనార ఉత్పత్తులను ఆగస్టులో భారత్ నిషేధించింది. అంతకుముందు నేసిన, రెడీమేడ్ దుస్తుల దిగుమతులపై నిషేధం విధించింది. భూమార్గంలో వాటిని నిషేధించినప్పటికీ.. నవీ ముంబయిలోని పోర్టునుంచి మాత్రం వాటిని అనుమతిస్తోంది. అయితే అది బంగ్లాకు లాభదాయకం కాదు. అప్పటినుంచి ఆ దేశ ఎగుమతిదారుల ఖర్చులు గణనీయంగా పెరిగాయి. అలాగే ఈ ఏప్రిల్‌లో బంగ్లాదేశ్‌కు ఉన్న ట్రాన్స్–షిప్మెంట్ సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు. బంగ్లాదేశ్‌కు చెందిన ఎగుమతులు భారత్ మీదుగా ఇతర దేశాలకు వెళ్లడానికి అనుమతి ఉండేది. ఆ దేశ జనపనార వస్తువులను దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ కూడా ప్రధానమైంది.

ఇక మనదేశం తీసుకుంటున్న చర్యల కారణంగా ఎగుమతుల ఆదాయం జులైలో 3.4 మిలియన్ల డాలర్లకు తగ్గింది. అంతకుముందు ఏడాది అదే నెలలో 12.9 మిలియన్ల డాలర్లమేర వ్యాపారం జరిగిందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఇక, భారత్–బంగ్లా సంబంధాలు ఒత్తిడికి గురవుతుంటే, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పాక్ తెగ ఆరాటపడుతోంది. ఈ క్రమంలోనే కరాచీ పోర్టు ప్రతిపాదన వచ్చింది.

# అఫ్గాన్‌పై డ్రోన్ దాడుల వెనుక విదేశీ శక్తి?

## పాక్ అంగీకరించినట్టు అంతర్జాతీయ మీడియా కథనం



సరిహద్దు వెంబడి ఉగ్రవాద చర్యలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో పాకిస్థాన్– అఫ్గానిస్థాన్ మధ్య కొనసాగుతోన్న చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ తరుణంలో ఒక సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. అఫ్గాన్‌పై డ్రోన్ దాడుల వెనక విదేశీ శక్తి ఉందని పాక్ అంగీకరించినట్టు తెలుస్తోంది. దానితో ఉన్న ఒప్పందం కారణంగా ఆ దాడులు ఆపలేమని నిస్సహాయత వ్యక్తం చేసిందని సమాచారం. ఈ మేరకు అఫ్గాన్ మీడియాను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాన్ని ప్రచురించింది. పాక్‌నుంచి అఫ్గాన్ డ్రోన్ దాడులు నిర్వహించేందుకు అనుమతించేలా ఆ దేశంతో ఒప్పందం ఉందని, దానికి తాము కట్టుబడి ఉన్నామని పాక్ చెప్పినట్టు ఆ కథనం పేర్కొంది. ఆ అగ్రిమెంట్‌ను ఉల్లంఘించడం సాధ్యంకాదు కాబట్టి ఆ దాడుల్ని నిరోధించలేమని అంగీకరించిందని వెల్లడించింది. అయితే ఆ విదేశం పేరు మాత్రం పాక్ బయట పెట్టలేదని తెలిపింది. ఇదిలాఉంటే.. ఇటీవల పాక్–అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రెండువారాల క్రితం అఫ్గాన్ రాజధాని కాబుల్లో సంభవించిన పేలుళ్లతో అవి తీవ్రరూపం దాల్చాయి. పాకిస్థానీ తాలిబన్ ఫైటర్లకు ఆశ్రయం కల్పించేవారిపై తీవ్ర చర్యలు ఉంటాయని పాక్ హెచ్చరించిన నేపథ్యంలో ఈ పేలుళ్లు జరిగాయి. ఇటీవల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా అది నామమాత్రమే. పాక్–అఫ్గాన్ మధ్య దీర్ఘకాలిక శాంతి ఒప్పందం కోసం వీరి మధ్య తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో రెండోదశ చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అవి ఇంతవరకు ఒక కొలిక్కి రాలేదు. ఈ తరుణంలో పాక్ రహస్య ఒప్పందం గురించి బయటకు వచ్చింది.

# సిఐఏ కుట్రను తిప్పికొట్టాం

**- వెనుజువెలా మంత్రి వ్యాఖ్య**



ఇటీవల కాలంలో కరేబియన్ సముద్ర జలాల్లో డ్రగ్స్‌ను తరలిస్తున్న పడవలు, జలాంతర్గాములపై అగ్రరాజ్యం దాడులు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో అమెరికా యుద్ధ నౌకపై దాడిచేసి.. ఆ నేరం తమపైకి నెట్టేయాలని అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కుట్ర పన్నుతున్నట్టు వెనుజువెలా మంత్రి ఆరోపించారు. ఇందులో భాగంగా తమ దేశానికి చెందిన యూఎస్ఎస్ గ్రేవీ అనే గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్‌పై దాడిచేసి.. తమపై నేరం మోపాలని సీఐఏ పన్నాగం పన్నిందన్నారు. అయితే తమ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి దానిని భగ్నం చేశారని తెలిపారు. దాడికి ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. కరేబియన్ సముద్ర జలాల్లో యుద్ధాన్ని ప్రేరేపించే లక్ష్యంతో అగ్రరాజ్యం ఈ కుట్ర పన్నినట్టు వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద వాహక నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డు'ను వెనుజువెలా సమీపానికి తీసుకెళ్లడం ద్వారా అమెరికా ఆ దేశంపై ఒత్తిడి తీవ్రతరం చేస్తోంది. ఈ పరిణామాలను వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో ఇటీవల తీవ్రంగా ఖండించారు. అమెరికా ప్రభుత్వం తనపై యుద్ధం చేస్తోందని ఆరోపించారు. "ట్రంప్ యంత్రాంగం కొత్త, శాశ్వత యుద్ధాన్ని సృష్టిస్తోంది. మాదకద్రవ్యాల విషయంలో అతిశయోక్తులతో కూడిన, అసభ్యకరమైన, నేరపూరితమైన, తప్పుడు కథనాలను అల్లుతోంది. మా దేశం కొకైన్‌ను ఉత్పత్తి చేయదు" అని మదురో జాతీయ మీడియాలో ప్రసంగించారు. అనంతరం వెనుజువెలా మినిస్టర్ తాజా ఆరోపణలు చేయడం గమనార్హం. వెనెజువెలాకు చెందిన వ్యవస్థీకృత నేరాల ముఠా 'ట్రెన్ డి అరాగ్వా'కు మదురో నాయకుడని ట్రంప్ ఇటీవల ఆరోపించారు. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. ఆయన ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్ వెల్లడించారు.

# జమైకాను వణికిస్తోన్న హరికేన్

**మెలిసా కేటగిరీ-5గా వర్గీకరణ**



కరేబియన్ దేశం జమైకాలో హరికేన్ బీభత్సం సృష్టిస్తోంది. భారీ వరదల కారణంగా ఇప్పటికే ఇక్కడ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మెలిసా తుపాను ఈ ఏడాది భూమిపై నమోదైన హరికేన్లలో అత్యంత తీవ్రమైనదని అమెరికా వాతావరణ శాఖ నిపుణులు పేర్కొన్నారు. ఈ మెలిసా తుపాను కేటగిరీ–5గా వర్గీకరించారు. ఇది మరింత తీవ్రతరమై.. మంగళవారం తెల్లవారుజామున కరేబియన్ ద్వీపంలో తీరాన్ని తాకే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను నేపథ్యంలో జమైకాతో పాటు హైతీ, డొమినికన్ రిపబ్లిక్‌లలో నలుగురు మరణించారు. అమెరికాకు చెందిన నేషనల్ హరికేన్ సెంటర్ ప్రకారం.. ఈ ఏడాది భూమిపై నమోదైన అత్యంత బలమైన హరికేన్లలో మెలిసా తీవ్రమైనదని పేర్కొంది. మెలిసా కారణంగా గంటకు 280 కి.మీ వేగంతో గాలులువీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ సందర్భంగా కుండపోత వర్షాలతోపాటు కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌సీ డైరెక్టర్ మైఖేల్ బ్రెన్నాన్ పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రానున్న నాలుగు రోజుల్లో జమైకాలోని కొన్ని ప్రాంతాల్లో 100 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌సీ పేర్కొంది. భారీ వరదల కారణంగా హైతీలో వందలాది ఇళ్లు మునిగిపోయాయి. జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్నెస్ ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. ప్రతిఒక్కరూ ఇంట్లోనే ఉండాలని, అధికారుల ఆదేశాలను పాటించాలని కోరారు. హరికేన్ తీవ్రతరం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను పాఠశాల బస్సుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

# గాజాకు పాక్ దళాలు!

## ఇజ్రాయెల్‌తో ఆర్థిక లబ్ధిమేరకే నిర్ణయం




ఇజ్రాయెల్– హమాస్ మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో శాంతి ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గాజాలో పాకిస్థాన్ తన దళాలను మోహరించేందుకు సిద్ధమైంది. శాంతి ఒప్పందంలోని అంతర్జాతీయ దళాలలో భాగంగా పలు దేశాలు తమ బలగాలను పంపనున్నాయి. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిం మునీర్, ఇజ్రాయెల్‌కు చెందిన మొసాద్, యూఎస్‌కు చెందిన సీఐఏ సీనియర్ అధికారుల మధ్య రహస్య సమావేశాలు జరిగాయి. ఈ క్రమంలో పాక్ సైనికుల మోహరింపునకు సంబంధించిన ఓ నిర్ణయం వెలువడినట్టు తెలుస్తోంది. ఇందులోభాగంగా దాదాపు 20వేలమంది సైనికులను పాక్ అక్కడకు పంపనుంది. దీనికి సంబంధించి ఇస్లామాబాద్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. పాక్ దళాలు గాజాలో అంతర్గత భద్రతను కట్టుదిట్టం చేయడం, మానవతా సాయం, పునర్నిర్మాణానికి సంబంధించిన సేవలు అందిస్తాయి. దీంతోపాటు హమాస్‌ను ఆయుధరహితంగా మార్చడంతో సహా సరిహద్దుల్లో భద్రత బాధ్యతలు చేపడుతాయి.

పాక్ దళాలు.. ఇజ్రాయెల్, గాజాలోని మిగిలిన మిలిటెంట్ వర్గాల మధ్య బఫర్ ఫోర్స్గా పనిచేస్తాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మోహరింపునకు ప్రతిగా.. ఇజ్రాయెల్, అమెరికాలనుంచి పాక్‌కు ఆర్థిక ప్రోత్సాహకాలకు సంబంధించిన హామీలు లభించినట్టు తెలుస్తోంది. పాక్ దళాల ప్రమేయం సున్నితమైనదని, కానీ వ్యూహాత్మకంగా ప్రయోజనం చేకూరేదని ఇజ్రాయెల్ మీడియా అభివర్ణించింది. ఐక్యరాజ్యసమితి శాంతి కార్యకలాపాలకు ఎక్కువగా దళాలను అందించే దేశాల్లో పాక్ ఒకటి. ఆఫ్రికా, ఆసియా అంతటా ఐరాస కార్యకలాపాలకు 2 లక్షలకంటే ఎక్కువమంది దళాలను ఇప్పటికే మోహరించింది.

# కెనడాలో పంజాబ్ యువతి హత్య

## నిందితుడు భారత్‌కు పరారైనట్టు అనుమానం



కెనడాలో భారత యువతి దారుణ హత్యకు గురైంది. పంజాబుకు చెందిన అమన్ ప్రీత్ సైనీ ఇటీవల తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయింది. ఈ కేసులో మరో భారతీయుడిని పోలీసులు అనుమానితుడిగా భావిస్తున్నారు. అతడి కోసం గాలింపు చేపట్టారు. అయితే ఇప్పటికే అతడు భారత్‌కు పారిపోయినట్టు కథనాలు వెలువడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. పంజాబ్‌లోని సంగ్రూరుకు చెందిన 27 ఏళ్ల సైనీ గత కొన్నేళ్ల క్రితం కెనడా వెళ్లి టొరంటోలో నివసిస్తున్నారు. గతవారం ఆమె లింకన్ ప్రాంతంలోని ఓ పార్కులో తీవ్ర గాయాలతో విగతజీవిగా కన్పించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సైనీని హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు.. మరో భారతీయుడు మన్ ప్రీత్ సింగును అనుమానితుడిగా పేర్కొన్నారు. అతడిని వాంటెడ్‌గా ప్రకటిస్తూ గాలింపు చేపట్టారు. అతడి ఫొటోను కూడా విడుదల చేశారు. అయితే అప్పటికే అతడు దేశం విడిచి పారిపోయినట్లుగా అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. మన్ ప్రీత్ ఆచూకీ కోసం కెనడా అధికారిక వర్గాలు భారత్‌ను సంప్రదించినట్టు తెలుస్తోంది.

# నేటి నుంచే ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్

## భారత్ తుది జట్టు ఇదే!

ఆస్ట్రేలియా, భారత్ మధ్య బుధవారం నుంచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్‌నకు సన్నాహకంగా ఈ సిరీస్‌ను ఉపయోగించుకోవాలని టీమిండియా చూస్తోంది. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో మొద టి మ్యాచ్ కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్ వేదికగా జరగనుంది. 2-1 తేడాతో వన్డే సిరీస్ కోల్పోయిన టీమిండియా.. పొట్టి సిరీస్ అయినా పట్టాలనే పట్టుద లతో ఉంది. పొట్టి ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాపై భారత్‌కు మంచి రికార్డే ఉంది. ఇప్పటివరకు ఆడిన 32 మ్యాచ్‌ల్లో 20 సార్లు గెలుపొందింది. ఆసీస్ కేవలం 11 మ్యాచ్‌ల్లో మాత్రమే విజయం సాధించింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత యువ జట్టు ఇదే ఫామ్‌ను కొనసాగించాలని భావిస్తోంది. ఇటీవలి కాలంలో సూపర్ ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లపై అభిమానుల భారీగా అంచనాలు పెట్టుకున్నారు. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుతంగా రాణిస్తున్నాడు. వన్ డౌన్‌లో తిలక్ వర్మ అదరగొడుతున్నాడు. సంజూ శాంసన్ సక్సెస్ ట్రాక్‌లోనే ఉన్నా



డు. గిల్ నుంచి స్థాయికి తగ్గ ఇన్నింగ్స్‌లు బాకీ ఉన్నాయి. శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్లుగా సత్తా చాటుతున్నారు. వరుణ్ చక్రవర్తి పర్వాలేదనిపిస్తున్నాడు. బుమ్రా, అర్ష్‌దీప్ రాణిస్తున్నారు. ప్రస్తుతం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ ఒక్కటే టీమిండియాను కలవరపెడుతుంది. ఈ ఆసీస్ సిరీస్‌లో అయినా లయ అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే సూర్య ఫామ్‌పై హెడ్ కోచ్ గంభీర్ కూడా స్పందించాడు. ఫామ్ అనేది సమస్యే కాదని స్పష్టం చేశాడు.

**తొలి టీ20.. భారత జట్టు అంచనా!**

అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా.

## అభిషేక్ శర్మను ఎదుర్కోవడానికి సిద్ధం: మిచెల్ మార్ష్




ఆస్ట్రేలియాతో టీమిండియా ఐదు టీ20ల సిరీస్ ఆడటానికి సిద్ధమైంది. బుధవారం కాన్‌బెర్రా వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఎప్పటిలాగే టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ మంగ ళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడాడు. అభిషేక్ శర్మను ఎదుర్కోవడానికి తమ జట్టు సిద్ధంగా ఉందని స్పష్టం చేశాడు. అభిషేక్ శర్మ అద్భుతమైన ఆటగాడు. ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ప్రాతినిధ్యం వహిస్తూ సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. నిజానికి అతడు మాకో ఛాలెంజ్. కానీ మేం అతడిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లతో తలపడి మనల్ని మనం పరీక్షించుకోవాలని కెప్టెన్ మార్ష్ అన్నాడు.

బరిలోకి ఇంగ్లిష్..

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ జోష్ ఇంగ్లిష్ ఇటీవల జరిగిన న్యూజిలాండ్ సిరీస్‌కు దూరమైన విషయం తెలిసిందే. దీనిపై ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ స్పందించాడు. 'గాయం కారణంగా ఇంగ్లిష్ న్యూజిలాండ్ సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. టీ20 సిరీస్‌లో జట్టుకు అందుబాటులో ఉన్నాడని తెలిపారు.

## నిలకడగానే శ్రేయస్ ఆరోగ్యం: సూర్యకుమార్

టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో అలెక్స్ క్యారీ ఇచ్చిన క్యాచ్‌ను అందుకునే క్రమంలో కిందపడిపోయాడు. అతడి పక్కటెముకలు నేలకు బలంగా తాకడంతో అతడి ప్లీహానికి తీవ్ర గాయమైంది. అంతర్గత రక్తస్రావం కావడం వల్ల శ్రేయస్‌ను ఐసీయూలో చేర్చి చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో టీమిండియా టీ20 కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్.. శ్రేయస్ గాయంపై కీలక విషయాలు వెల్లడించాడు. 'శ్రేయస్ గాయపడ్డాడని తెలిసిన వెంటనే అతడికి ఫోన్ చేశాను. కానీ మొబైల్ అతడి దగ్గర లేదని తెలిసింది. మళ్లీ వెంటనే ఫిజియో కమలేశ్ జైన్‌కు ఫోన్ చేసి మాట్లాడాను. పెద్దగా కంగారు పడాల్సిన అవసరం లేదని చెప్పాడు. అయ్యర్‌తో కూడా మాట్లాడించాడు. గత రెండు రోజులుగా అయ్యర్ నాతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అతడి ఆరోగ్యం నిలకడగానే ఉంది. కొన్ని రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండనున్నాడు. ప్రస్తుతం శ్రేయస్ అందరికీ స్పందిస్తున్నాడు. అందరితోనూ మాట్లాడుతున్నాడు. ఇది మంచి విషయం' అని సూర్య వ్యాఖ్యానించాడు. మరోవైపు టీమిండియా ఫిజియోలను బీసీసీఐ చీఫ్ ప్రత్యేకంగా అభినందించారు. వారు వేగంగా స్పందించి ఆసుపత్రికి తరలించడం వల్లే అయ్యర్‌కు ప్రాణాపాయం తప్పిందని అన్నారు.

**రీఎంట్రీ అప్పుడేనా..?**

శ్రేయస్ అయ్యర్‌కు అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. ప్లీహం గాయం నుంచి పూర్తిగా కోలుకునేందుకు కనీసం మూడునెలల సమయం పడుతుందని డాక్టర్లు తెలిపారు. దీంతో శ్రేయస్ మైదానంలో బ్యాట్ పట్టేందుకు సుదీర్ఘ సమయమే పట్టనుంది. దీని ప్రకారం ఐపీఎల్ 2026లో శ్రేయస్ మైదానంలోకి రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.



## అయ్యర్ స్థానంలో తెలుగోడికి ఛాన్స్!





భారత బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఆస్ట్రేలియాతో జరిగిన సిడ్నీ వన్డేలో ఫీల్డింగ్ చేస్తూ తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడు సిడ్నీ ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ పరిణామం భారత్ కు గట్టి ఎదురు దెబ్బే అని చెప్పొచ్చు. శ్రేయస్ అయ్యర్ కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఇదే సమయంలో నవంబర్ 30 నుంచి దక్షిణాఫ్రికా సిరీస్‌లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అయ్యర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు జట్టు యాజమాన్యం ప్రత్యామ్నాయాలు ప్రారంభించిందని సమాచారం. అయ్యర్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతుంటాడు. ఈ స్థానాన్ని భర్తీ కోసం ముగ్గురు పేర్లు వినిపిస్తుండగా.. వారిలో తెలుగోడు తిలక్ వర్మ పేరు కూడా ఉందని తెలుస్తోంది.

శ్రేయస్ అయ్యర్ స్థానం భర్తీ చేసేందుకు మొదటగా సంజూ శాంసన్ పేరు వినిపిస్తోంది. గత వన్డే సిరీస్‌లో సంజూ చూపిన అద్భుతమైన ఫామ్‌ను దృష్టిలో ఉంచుకుని అతనికి అవకాశం దక్కే అవకాశాలు ఉన్నాయి. సంజూ శాంసన్ ఇప్పటివరకు ఆడిన 16 వన్డే మ్యాచ్‌లలో 56.66 అద్భుతమైన సగటుతో 510 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 3 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇక జాబితాలో వినిపిస్తోన్న రెండో పేరు తిలక్ వర్మ. గత నెలలో ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్తాన్‌పై మ్యాచ్ గెలిపించిన ఇన్నింగ్స్‌తో తిలక్ వర్మ రాత్రికి రాత్రే స్టార్‌గా మారాడు. యువ ఆటగాడైన తిలక్ వర్మను ఎంపిక చేస్తే దక్షిణాఫ్రికా సిరీస్‌లో నవంబర్ 4లో భారత బ్యాటింగ్‌కు మరింత బలం, దూకుడు లభిస్తాయని క్రీడా నిపుణులు చెబుతున్నారు. ఇక మూడో ఆప్షన్‌గా రియాన్ పరాగ్ పేరు వినిపిస్తోంది. ఇతడు గత ఏడాది శ్రీలంకతో వన్డేల్లో అరంగేట్రం చేసినప్పటికీ.. గాయం కారణంగా జట్టు నుంచి దూరమయ్యాడు. పరాగ్ ఆడిన ఒక్కే ఒక వన్డేలో 15 పరుగులు చేశాడు. అలానే 9 ఓవర్లలో 3 వికెట్లు పడగొట్టాడు. ఈ ముగ్గురు ప్లేయర్లలో సంజూ శాంసన్ అత్యుత్తమ వన్డే సగటును కలిగి ఉండటం వల్ల శ్రేయస్ అయ్యర్ స్థానాన్ని భర్తీ చేయగల ప్లేయర్ అనే అభిప్రాయాలు వినిపి స్తున్నాయి. తిలక్ వర్మ అయితే 4వ స్థానానికి బలమైన వ్యక్తిగా ఉంటాడని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. తుది ఎంపిక జట్టు అవసరాలు, సెలెక్టర్ల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

## మంధాన ఆ పొరపాటు చేయకూడదు

మహిళల వన్డే ప్రపంచకప్ 2025 తుది అంకానికి చేరుకుంది. దీంట్లో భాగంగా గురువారం టీమిండియా నవీ ముంబై వేదికగా ఆస్ట్రేలియాతో సెమీ ఫైనల్‌లో తలపడనుంది. అయితే ఈ టోర్నీలో ఇంతకు ముందు ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు ఓట మి చవి చూసింది. ఆ మ్యాచ్‌లో ఆసీస్ కెప్టెన్ అలిస్సా హేలీ 142 పరుగులతో తుఫాన్ ఇన్నిం గ్స్ ఆడింది. దీంతో టీమిండియా నిర్దేశించిన 331 పరుగుల లక్ష్యాన్ని 49 ఓవర్లలోనే ఏడు వికెట్లు కోల్పోయి ఆసీస్ ఛేదించింది. దీంతో ఆ మ్యాచ్‌లో మూడు వికెట్ల తేడాతో ఆసీస్ విజయం సాధించింది. అయితే ఆ మ్యాచ్‌లో స్మృతి మంధాన 80 పరుగులు చేసినప్పటికీ ఆ నాక్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కేవలం 66 బంతుల్లోనే 80 పరుగులు చేసిన స్మృతి అనవసర షాట్ ఆడి




తన వికెట్ కోల్పోయింది. ఈ విషయంపై టీమిండియా మాజీ క్రికెటర్ అంజుమ్ చోప్రా మాట్లాడారు. 'ఆసీస్‌తో మ్యాచ్‌లో స్మృతి మంధాన 80 పరుగులు చేసి ఔటైం ది. తాను వికెట్ కోల్పోయింది అనడం కంటే.. తన వికెట్ తానే సమర్పించుకుంది అనడం సబబు. ఆమె మరోసారి అలాంటి పొరపాటును రిపీట్ చేయకూడదు. ప్రపంచకప్‌నకు ముందు ఆసీస్‌తో మూడు వన్డేల్లో ఆమె ఆడిన ఇన్నింగ్స్ ఎవరూ మర్చిపోలేదు. ఆ స్థానానికి చేరుకో వడానికి ఆమె చాలా కృషి చేసింది. కాబట్టి స్మృతి దాన్ని కొనసాగిస్తూ సెమీఫైనల్‌లో రాణిస్తుందని ఆశిస్తున్నట్లు అంజుమ్ వ్యాఖ్యానించారు.

**బాధ్యతంతా స్మృతిదే..!**

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ ప్రతీక రావల్ బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడింది. చీలమండ గాయం కారణంగా ప్రపంచ కప్‌నకు దూరమైంది. ఈ నేపథ్యంలో సెమీఫైనల్‌లో స్మృతి మంధానపైనే మరింత బాధ్యత పెరిగింది. వరల్డ్ కప్‌లో ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల్లో స్మృతినే టాప్ స్కోరర్. కేవలం ఏడు మ్యాచ్‌ల్లో దాదాపు 102 స్ట్రైక్ రేట్‌తో 365 పరుగులు సాధించింది.

## బంగ్లాపై వెస్టిండీస్ ఘన విజయం

బంగ్లాదేశ్ తో జరిగిన తొలి టీ20 మ్యాచ్ లో 16 పరుగుల తేడా వెస్టిండీస్ విజయం సాధించింది. చట్టోగ్రామ్ వేదికగా నిన్న (సోమవారం) బంగ్లా, విండీస్ మధ్య తొలి టీ 20 మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కరేబియన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. షాయ్ హోప్ (46), రోవ్‌మన్ పావెల్ (44), అలిక్ అథనాజ్ (34), బ్రాండన్ కింగ్ (33) రాణించారు. షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ పరుగు ఖాతా ఓపెన్ చేయకుండానే పెవిలియన్ చేరాడు. ఇక బంగ్లా బౌలర్లలో తస్కిన్ అహ్మద్ రెండు, రిషద్ హొస్సేన్ ఒక వికెట్ తీశారు. అనంతరం 166 పరుగుల టార్గెట్‌ను ఛేదించే క్రమంలో బంగ్లాదేశ్ ఓ మోస్తరు పోరాటం చేసి చేతులెత్తేసింది. దీంతో 19.4 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌటైంది. తంజిమ్ హసన్ (33), తౌహిద్ హృదోయ్ (28), నసుమ్ అహ్మద్ (20) ఓ మోస్తరు ఇన్నింగ్స్‌లు ఆడారు. స్టార్ బ్యాటర్, కెప్టెన్ అయిన లిట్టన్ దాస్ 5 పరుగులకే ఔటయ్యాడు. వెస్టిండీస్ బౌలర్లలో జేడన్ సీల్స్, జేసన్ హోల్డర్ తలో 3 వికెట్లు తీశారు. అకీల్ హొసేన్ 2, ఖారీ పియెర్, రొమారియో షెఫర్డ్ తలో వికెట్ పడగొట్టారు. బంగ్లాదేశ్, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచుల టీ20 సిరీస్ జరుగుతుంది. ఈ సిరీస్‌లోని రెండో టీ20 కూడా చట్టోగ్రామ్ వేదికగా అక్టోబర్ 29న జరుగనుంది.

## కొత్త డేట్ ఇచ్చిన ‘డెకాయిట్’

అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ డెకాయిట్. తాజాగా కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 2026 ఉగాదిని పురస్కరించుకుని మార్చి 19న ఈ సినిమాను విడుదల చేయనున్నారు. సంబంధిత పోస్టర్‌ను అడివి శేష్ సోషల్ మీడియాలో పంచుకుంటూ.. ‘ఈసారి మామూలుగా ఉండదు. ముందుకు వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరం లేదు’ అని క్యాప్షన్ పెట్టారు. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రమిదే. విభిన్న ప్రేమకథతో తెరకెక్కుతున్న సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రుతిహాసన్ ఎంపికైన సంగతి తెలిసిందే. కానీ, ఆమెస్థానంలో ఇప్పుడు మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. డిసెంబరు 25న విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం గతంలో వెల్లడించగా.. ఇప్పుడు వాయిదావేసి.. మార్చి 19న విడుదల చేయనున్నట్టు చిత్రబృందం ప్రకటించింది.



## రజనీ, ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు



తమిళనాడులో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. సినీ, రాజకీయ ప్రముఖుల ఇళ్లకు వరుస బాంబు బెదిరింపులు వస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తాజాగా తమిళ అగ్రనటులు రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ మేరకు చెన్నై డీజీపీ కార్యాలయానికి మంగళవారం తెల్లవారుజామున ఈ మెయిల్ వచ్చింది. అందులో చెన్నై పోయిస్ గార్డెన్‌లోని రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు, కీల్పాక్కంలో ఉన్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై ఇళ్లకు బెదిరింపులు వచ్చాయి. దీంతో బాంబు స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్ల సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెన్నైలో భద్రతను కట్టుదిట్టం చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సినీ నటి త్రిష నివాసాలతో పాటు భాజపా ప్రధాన కార్యాలయానికి, డీజీపీ ఆఫీసుకి, రాజ్‌భవన్‌కు అక్టోబర్ 3న బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. తర్వాత అక్టోబర్ 13న మరోసారి ఎంకే స్టాలిన్, రజనీకాంత్ ఇళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి.

## పెద్ది పనుల్లో సుక్కూ బిజీ





రామ్‌చరణ్ హీరోగా జాన్వీకపూర్ హీరోయిన్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న మాస్ ఎంటర్టైనర్ “పెద్ది”. భారీ అంచనాలతో ఉన్న ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు అంతిమ దశకు చేరుకుంటుంది. ఇక ఈ సినిమా విషయంలో ఓ ఇంట్రెస్టింగ్ టాక్ వినిపిస్తోంది. స్టార్ డైరెక్టర్ సుకుమార్ సైతం సినిమా పనుల్లో భాగమైనట్టు టాక్ నడుస్తోంది. సుకుమార్ సహా నిర్మాతగా ఈ సినిమాకి సహకారాన్ని అందిస్తున్న సంగతి తెలిసిందే. కానీ ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా తాను దగ్గరుండి చూసుకుంటున్నట్టు టాక్. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తోంది.

## పారితోషికంపై కాదు, పాత్రలపైనే నా దృష్టి

ఇండస్ట్రీలో వేతన అసమానతలపై నటి ప్రియమణి సైతం తాజాగా గొంతు విప్పారు.తన అనుభవాలను ప్రస్తావిస్తూ.. సహనటులకంటే తక్కువ పారితోషికం పొందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అయితే, ఆ విషయం తనను బాధించదనీ చెప్పారు. “నేనెప్పుడూ పారితోషికానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. మన స్టార్డమ్ ఆధారంగా దాన్ని అందిస్తారు. దాన్ని దృష్టిలో పెట్టుకొనే దర్శక నిర్మాతలను అడుగుతాను. నాతోపాటు నటించిన వారికంటే నేను తక్కువ రెమ్యూనరేషన్ తీసుకున్న సందర్భాలు ఎన్నో. ఎప్పుడూ బాధ పడలేదు. నా పాత్ర నిడివి, నా నటన ఆధారంగా దాన్ని అందిస్తారన్న అవగాహన ఉంది. నేను అర్హురాలిని అనుకుంటే డిమాండ్ చేస్తాను. అనవసరంగా రెమ్యూనరేషన్ పెంచాలని కోరను” అని చెప్పారు. దక్షిణాది, ఉత్తరాదిలలో షూటింగ్ టైమింగ్స్ గురించీ ప్రియమణి తన అభిప్రాయాన్ని వెల్లడించారు. “రెండు ప్రాంతాల్లో చిత్రీకరణ టైమింగ్ భిన్నంగా ఉంటుంది. సౌత్‌లో ఉదయం 8 గంటలకు షూటింగ్ ప్రారంభిస్తామని షెడ్యూల్ ఇస్తే.. కచ్చితంగా ఆ సమయానికి ప్రారంభిస్తారు. కానీ, నార్త్‌లో ఆ సమయానికి నటీనటులు ఇంటినుంచి బయల్దేరుతారు” అని ప్రియమణి అన్నారు. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో ఆమెబిజీగా ఉన్నారు. ఇటీవలే ‘ఆఫీసర్ ఆన్ డ్యూటీ’, ‘ది గుడ్ వైఫ్’లతో ప్రేక్షకులను పలకరించారు. కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో రానున్న ‘జననాయగన్’లో నటిస్తున్నారు. దీనితోపాటు ‘ది ఫ్యామిలీ మ్యాన్’ మూడో సీజన్‌లోనూ ప్రియమణి కనిపించనున్నారు.



## టైమొచ్చినపుడు.. అన్నీ చెబుతా



ప్రస్తుతం రష్మిక ‘ది గర్ల్‌ఫ్రెండ్’ సినిమా ప్రచారంలో బిజీగా ఉంది. నవంబర్ 7న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో మీడియా సమావేశాలతో మరింత జోష్ పెంచుతోంది. పనిలో పనిగా.. విజయ్‌తో ఎంగేజ్మెంట్ పైనా, విజయ్‌తో చేసిన ‘డియర్ కామ్రేడ్’ సినిమాపైనా స్పందించారు. “డియర్ కామ్రేడ్‌ను థియేటర్‌లో ఆడియన్స్‌తోపాటు చూశాను. కానీ, మేం ఆశించిన ఫలితం రాలేదు. నా దృష్టిలో ఇప్పటికీ అది ఒక గొప్ప చిత్రమే. ఆ సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వచ్చిన తర్వాత కూడా ‘దీన్ని ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్లడానికి మనం ఇంకా ప్రయత్నిద్దాం’ అని చిత్ర బృందానికి చెప్పాను. కానీ, అది ఫలించలేదు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో ‘డియర్ కామ్రేడ్’ గురించి పోస్టులు పెడుతున్నారు. ఇది ప్రేక్షకులకు నచ్చుతుందని నేను అప్పుడు చెబితే ఎవరూ వినలేదు. ఒక సినిమా కోసం దర్శక నిర్మాతలు ఎంతో కష్టపడతారు. దానికి తగిన ఫలితం రాకపోతే నిజంగా బాధగా ఉంటుంది. ఆ సమయంలో ఆదరించకుండా రెండు మూడేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే బాధగా ఉంటుంది” అని తెలిపారు. రష్మికను ఓ అభిమాని విజయ్‌తో నిశ్చితార్థం గురించి అడిగారు. దానికి ఆమె ఆసక్తికర సమాధానమిచ్చారు. ‘ఎప్పుడు చెప్పాలో అప్పుడు చెబుతాను. ఈ విషయంలో మీకు ఏమనిపిస్తుందో అదే నిజం’ అని అన్నారు.

## బోల్డ్ సీన్స్‌కు నో చెప్పడంవల్లే..

‘సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు’, ‘రాజుగారి గది’, ‘నేను శైలజ’, ‘జయ జానకి నాయక’వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటి ధన్య బాలకృష్ణ. ఆమె ప్రస్తుతం తన కొత్త సినిమా ‘కృష్ణ లీల’ ప్రమోషన్లలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆమె కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఆమె మాట్లాడుతూ.. “నా కెరీర్‌లో పెద్ద విజయాలు సాధించలేక పోవడానికి కారణం నేనే. గ్లామర్ లేదా బోల్డ్ సీన్లను అంగీకరించకపోవడంవల్ల కొన్ని మంచి అవకాశాలు కోల్పోయాను. మొదట్లో ఇతరులను చూసి నిరాశ చెందేదాన్ని. కానీ తర్వాత నేను తీసుకున్న నిర్ణయాలు నా మార్గాన్ని నిర్ణయించాయని అర్థమైంది” అని చెప్పింది. తన ఫ్యామిలీ నేపథ్యం కూడా ఇందుకు కారణమంటూ ఆమె బాధపడుతూ చెప్పిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఏదేమైనా గ్లామర్ పాత్రలకే ప్రిఫరెన్స్ ఇచ్చే మేకర్స్ ఉన్నంతవరకు తనలాంటి టాలెంటెడ్ హీరోయిన్లకు ఛాన్సులు రావడం కష్టమేనంటూ ఆమె చెప్పుకొచ్చింది.



## ఫస్ట్‌వీక్‌లో అఖండ సాంగ్?



నందమూరి బాలకృష్ణ హీరోగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కలయికలో రానున్న తాజా చిత్రమే “అఖండ 2 తాండవం”. భారీ అంచనాలున్న సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. అంతే కాకుండా ఇటీవల వచ్చిన కొత్త టీజర్ కూడా మంచి రెస్పాన్స్ అందుకుంది. ఇక అభిమానులు ఆసక్తిగా చూస్తోంది సినిమా ఫస్ట్ సింగిల్ కోసమే. దీనిపై లేటెస్ట్ బజ్ వినిపిస్తోంది. దీని ప్రకారం మేకర్స్ మొదటిపాటగా పవర్ఫుల్ టైటిల్ సాంగ్‌ని లాంచ్ చేస్తారని తెలుస్తోంది. అంతేకాకుండా ఈ నవంబర్ మొదటివారంలో ఈ సాంగ్ వచ్చే ఛాన్స్ ఉందట. ఇక దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.

ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే 14 రీల్ ప్లస్ నిర్మాణం వహిస్తుండగా.. డిసెంబర్ 5న పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్‌కి రానుంది.